# అవధాన పుష్కరిణి

అంతర్జాల మాసపత్రిక

సంపుటి: 1 సంచిక: 5 మాఘ శుద్ధ విదియ, 20 జనవరి 2026

## అనన్యసామాన్య ధారణాధురీణులు కొప్పరపు సోదర కవులు



కొప్పరపు వేంకట సుబ్బరాయ శర్మ
(12.11.1885 29.03.1932)



కొప్పరపు వేంకట రమణ శర్మ
(30.12.1887 21.03.1942)

కం॥ తన జారకృత్య మితరులు
గనకుండఁ బటంబుఁ జుట్టెఁ గాళ్ల కపుడు కా
మిని పాదనూపురము ఖం
గున మ్రోఁగదు హేతువేమొకో, యనవేలా?

'కామిని పాదనూపురము ఖంగున మ్రోఁగదు హేతువేమొకో' అనే ఉత్పలమాలలో ఇచ్చిన సమస్యకు కందపద్యపూరణ

అవధాన విద్యా విజయతే తరామ్

ప్రచురణ
అవధాన విద్యా వికాస పరిషత్
భాగ్యనగరం







దర్శనమ్ ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక ఆధ్వర్యంలో

2026 జనవరి 9,10 తేదీలలో హైదరాబాద్ బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్తులో

శృంగేరీ పీఠాధీశ్వరులు జగద్గురు శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాసన్నిధానంవారు, శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ సన్నిధానం వారి

ఆశీరనుగ్రహంతో 'వజ్రోత్సవభారతి - అవధానసంక్రాంతి'గా

త్రిభాషా మహాసహస్రావధాని బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి సంయోజకత్వంలో జరిగిన

'శతావధాన తిలక' ఉప్పలధడియం భరత్‌శర్మ శతావధానం

# అవధాన పుష్కరిణి

సంపుటి - 1 | అంతర్జాల మాస పత్రిక | సంచిక - 5

విశ్వావసు - మాఘం 2026 | 20-01-2026 | ప్రచురణ: అవధాన విద్యా వికాస పరిషత్


శ్రీయుతమై రసైకలహరీసితమై, వివిధావధాన వి
ద్యాయతధీకవీశ్వరులు తామరలై విరియన్ - తదీయ వి
జ్ఞేయ సుపద్యమాధురు లశేషబుధాళుల కిందు విందుగా
నీ యవధాన పుష్కరిణి - ఈప్సితమై వెలుగొందు నందమై
- డా. జి.యం.రామశర్మ, శతావధాని


## సంపాదక వర్గం

**ప్రధాన సంపాదకులు**
మరుమాముల దత్తాత్రేయశర్మ

**సహసంపాదకులు**
కె.వి.ఎన్. ఆచార్య

**గౌరవ సలహాదారులు**
నారుమంచి వేంకట అనంతకృష్ణ శర్మ
మరుమాముల వేంకటరమణశర్మ
కంది శంకరయ్య

**సంపాదకవర్గం**
డా॥ జి.యం.రామశర్మ
ఆముదాల మురళి
డా॥ సంగనభట్ల నరసయ్య
మారేపల్లి వేంకట పట్వర్ధన్
ఆచార్య ఫణీంద్ర
చిటితోటి విజయకుమార్
చింతా రామకృష్ణారావు

**రూపకల్పన:** పంతుల విట్టుబాబు
**అక్షరాలంకరణ:** విరివెంటి సాహితీసుధ



**కార్యాలయం**
శ్రీరామ సదనం, 29-1499/6/1,
వెస్ట్ కాకతీయ నగర్, రోడ్ నం.1,
నేరేడుమెట్టు, సికిందరాబాద్ - 500 056
ఫోన్: 9441039146


అవధాన విద్యా వికాస పరిషత్ సేవాకార్యక్రమాలకు ఆర్థికంగా సహకరించదలచిన సహృదయులు ఫోన్ పే ద్వారా స్పందించగలరు.

**అవధానవిద్యా విజయతే తరామ్** | **సంపాదకీయం**

## రసజ్ఞత ఇంచుక చాలకున్న..

కవిత్వం కవి అంతశ్చేతన లోంచి ఉబికి వచ్చే ఒకానొక అనుభవైకవేద్య సద్యఃఫలమై సహృదయుల హృదయాలపై అక్షరాల పన్నీటిజల్లు జల్లాలి. పద్యం, వచనం, గేయం – రూపం ఏదైనా సరే ..అది ఎదుటివారి యెదను కదిలించాలి. రసానుభూతిని రగిలించాలి. ఒక్కోసారి కవితలలో కవి తలలో మెఱవని భావాలు సైతం సహృదయునికి గోచరించవచ్చు. అందుకే 'కప్పిచెప్పేవాడుకవి అయితే విప్పి చెప్పే వాడు విమర్శకు'డౌతాడు. దీన్నే ఒక చాటువులో... **కవితాకన్యక గుణములు / కవికన్న రసజ్ఞుఁ డెఱుఁగు కవియేమెఱుగున్?/ భువిలోఁ గన్యక గుణములు / ధవుఁ డెఱుఁగును గాక కన్న తండ్రేమెఱుఁగున్?** (దీపాల పిచ్చయ్య శాస్త్రి గారి 'చాటుపద్యరత్నాకరము' నుండి) కవిజనకుడు..రసజ్ఞుడే నాథుడు.

పొత్తపి వెంకటరమణ కవి ఇదే భావాన్ని మరోలా లక్షణశిరోమణిలో నాచన సోమన కృత పద్యాన్ని ఉట్టంకిస్తూ... **కవితాకన్యక కెందును / కవిజనకుడు, బట్టుదాది గణుతింపంగా / నవరస రసికుడె పెనిమిటి / యవివేకియె, తోడు బుట్టువనవేమ నృపా!!** అంటాడు. మరి కవితాకన్యక వరించేవానికి ఏయే గుణగణాలుండాలంటే..

**నైవ వ్యాకరణజ్ఞమేతి పితరం నభ్రాతరం తార్కికమ్ / దూరాత్ సంకుచతీవ గచ్ఛతి వపుః చండాలవత్ ఛాందసాత్ / మీమాంసా నిపుణం నపుంసకమితి జ్ఞాత్వా నిరస్యాదరాత్ / కావ్యాలంకారణజ్ఞమేవ కవితాకన్యా వృణేతే స్వయమ్**

వైయాకరణులు, తార్కికులు , ఛాందసులు , మీమాంసకులు ... వీళ్ళందరూ కవిత్వ విషయంలో ఏకపక్షంగా ఉండే వాళ్ళే. వాళ్ళు శాస్త్రం ప్రకారం ఆమె గుణగణాలను మదింపు చేసేవారే. ఎవరికీ కవితారసాన్ని ఆస్వాదించే లక్షణం లేదు. లక్ష్య లక్షణ యుక్తంగా ఉందా లేదా అనే ధ్యాసే తప్ప, వారెవరూ కవిత్వ రసాస్వాదనాదృష్టిపరులు కాజాలరు.

అందుచేత కవితా కన్య వారిని అనాదరిస్తుంది. వారినుండి దూరంగా తొలిగిపోతుంది. మరి, ఆమె వరించేది కావ్యాలంకారవేత్తను మాత్రమే. అలంకార శాస్త్రజ్ఞులు మాత్రమే కవితకు వెలకట్టి రసాస్వాదన చేయగలవారు. వారు రసజ్ఞులు. అందువల్ల వారే కవితాకన్యకు ప్రియులు. అలా కవిత్వం చెప్పగలవారే ధన్యులు.

సద్యస్స్ఫూర్తితో రసజ్ఞమనోభిరామంగా చెప్పగల అవధానులు కవులకెల్లా ధన్యతములు – అని తరతరాలుగా నిరూపితమౌతూనే ఉంది.



# సంస్తుతి



## మాతృప్రణతి

**- డా॥ మాడుగుల నాగఫణిశర్మ**

అమ్మ ను నమ్ముకొంటిని యహమ్ము నిహమ్మును మాని పూనికన్
అమ్మల గన్నయట్టి ముగురమ్మల మూలపు టమ్మనున్, సు గీ
తమ్ముల, సత్కవిత్వముల ధార లుదారత నుగ్గుపాలుగా
గొమ్మని పోసినట్టి రస ఘూర్ణ వితీర్ణ సువర్ణ వర్ణ యా
(మా అమ్మ ను నమ్ముకొంటి)
ఇమ్మహనీయ భారముల నేనిక మోయగ లేనటంచు కం
ఠమ్మున కచ్చపి న్నిలిపి నా మృదు భాషల పల్లవించు వ్యా
జమ్మున సుస్వరావళిన్ సిద్ధము చేసిన యట్టిదైన
(మా అమ్మ ను నమ్ముకొంటి)
సమ్మిళితార్ద్ర భావ శిరసా మనసా వచసా పదే పదే
రమ్మని చేర బిల్చియు శిరమ్ము నురమ్మున జేర్చునట్టి
(మా అమ్మను నమ్ముకొంటి)
అమ్మను అమ్మనంచు హృదయమ్మున నమ్మిన సత్యదీక్షతో
సొమ్ములు గిమ్ములన్ గొనక, చొక్కి శరీరము పాయకుండ, యే
సమ్మెట పోటులంటి బడక సద్గతి శ్రీహరి భక్తి తత్త్వ రా
జ్యమ్మున రాజ రాజుగ తుషార పటీర మరాళ కీర్తియై
కొమ్ముల క్రుమ్ము గిత్తలను కోలను బట్టి పొలాల సాలులో
దుమ్ములు, ధూళి బూసికొని దుక్కిట దున్నుటచే జనించు లే
చెమ్మట ధారలే కవన చిత్రణ మందున సార ధారలం
చమ్మని ముఖ్యసన్నిభు దహంకృతి దూరుడు, నార్ద్రచిత్తుడౌ
బమ్మెర పోతరాజకవి భాగవతంబు జగత్సుభార్థమై,
క్రమ్మిన కారుచీకటుల కాలమునందున మానవాళికిన్
చిమ్మిన లేత వెన్నెలల శీతమయూఖుని రేఖ వోలె, యే
యమ్మను నమ్మి చేసె, ననయమ్ము, నయమ్ము ప్రియమ్ము మీర, నా
అమ్మను నమ్ముకొంటి ని, మహాజనులార గ్రహింపు డీ సభన్.!

## ఇదీ క్రమణిక


1. సత్కవి ప్రతిభకు తార్కాణం సమస్యాపూరణం.. 3
2. ప్రహేళికా ... ... ... ... ... ... ... ... .. 3
3. అవధానకళాచరిత్ర ... ... ... ... ... ... . 4
4. కావ్యాస్వాదన ... ... ... ... ... ... ... ... 5
5. పద్యపరీమళం ... ... ... ... ... ... . 6,10,20
6. విశిష్ట తెలుగు భాషా వైభవం... ... ... ... .. 7
7. అవధానవేదిక ... ... ... ... ... ... ... ... 8
8. పూరణతోరణం ... ... ... ... ... ... . 11
9. ఛందస్సౌందర్యం ... ... ... ... ... ... ... 13
10. తెలుగు ఛందో లాక్షణిక గ్రంథములు ... ... 14
11. వ్యాకరణ పరివస్య ... ... ... ... ... ... .. 16
11. గర్భకవిత్వము ... ... ... ... ... ... ... .. 17
13. కావ్యశాస్త్రగవేషణ ... ... ... ... ... ... ... 18
14. బమ్మెర పోతన భాగవతం-అలంకారసౌందర్యం 21
15. ఖండశర్కర ... ... ... ... ... ... ... ... . 22
16. సంస్కృత సంస్కృతి ... ... ... ... ... ... 24




## సహృద్వాణి

సంచిక పూర్తిగాచదివేను. వర్తమాన, భావి అవధానులకు మిక్కిలి వుపయుక్తము. ఆముదాల మురళీ, చిటితోటి విజయ కుమార్ గార్ల వ్యాసాలు, సమస్యా పూరణలు ఆకట్టుకొన్నాయి. మీరు మంచి పని చేస్తున్నారు.సారస్వతారాధనము

**- డా. బులుసు వెంకటేశ్వర్లు**

సంచిక చదివాను. ప్రతి పూట చాలా విలువైనదే. దాచుకోవాల్సినదే. అమూల్య సమాచార పుష్టితో అలరారుతోంది. అభినందనలు.

**- డా. సంగనభట్ల నరసయ్య**

**ప్రకటన**

అవధానకళ భావితరాలకు నిరంతరాయంగా ప్రవహింపజేయడంలో మా వంతు కృషిగా అవధాన విద్యను యువతరానికి బోధించడానికి, **'అవధాన విద్యా వికాస పరిషత్తు'**ను ఏర్పాటు చేసి 2022వ సంవత్సరం నుండి నాలుగేళ్ళుగా 'భాగ్యనగరం'లో ఏడురోజులపాటు **'అవధాన శిక్షణ శిబిరాలను'** నిర్వహిస్తూ వస్తున్నాం. అలాగే ఈ 2026వ సంవత్సరం కూడా **మే రెండు, మూడు వారాలలో** శిక్షణ శిబిరం ఏర్పాటు జరుగుతుంది. నిర్వహించబోయే తేదీలను వేదిక వివరాలను, రాబోయే సంచికలలో ప్రకటించడం జరుగుతుంది.

అవధాన విద్యా విజయతే తరామ్

**- సంపాదకులు**




# సత్కవి ప్రతిభకు తార్కాణం - సమస్యా పూరణం

– శతావధాని డా॥ జి.యం. రామశర్మ

20వ శతాబ్దిలో బహుళ జనాదరణ పొందిన తెలుగు పద్య కవులలో అగ్రేసరులు శ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు. వారు కరుణశ్రీ (కలంపేరు) గా తెలుగు సాహితి లోకంలో సుప్రసిద్ధులు. వారి కవిత్వం సుమ సమ సుకుమార పద విన్యాసాలలో, సురుచిర భావ సౌరభాలతో హృదయంగమ శైలీ సంపన్నమై సహృదయసమ్మాన్యమై అలరారింది. ఉదయశ్రీ, విజయశ్రీ, కరుణశ్రీ, తెలుగు బాల శతకం, పుష్పవిలాపం మొదలైన కృతులు వారి మృదు మధుర కవితా వైశారద్యానికి కమనీయాకృతులు. ఆనాడు వారు సరదాకై కొన్ని సమస్యలను సరసంగా పూరించారు. అందులో ఒకటి –

'భామయు భామయుం గలియ బాలుడు పుట్టెను సత్యభామకున్'...

ఈ సమస్యలో ఉండే లోకవిరుద్ధాంశం విజ్ఞులోక విదితమే. శాస్త్రిగారి పూరణ ఎంతో రసరమ్యమో చూడండి!

ఉ॥ శ్రీమతి లేఖ పంపినది, చేయదు కార్యము మామ, తానట
గ్రామణియైన యల్లుడొక రాతిరి కూరిమి చెల్మికత్తెయై
మామ గృహమ్ముజేరి తన మానిని గూడెను, ఆ అసత్యపుం
భామయు భామయున్ గలియ బాలుడు పుట్టెను సత్యభామకున్

ఒక తండ్రి తన కూతురుకు వివాహం చేశాడు. కాని శోభనం జరిపించడంలో జాప్యం చేశాడు. ఆ కుమార్తె తన భర్తను కలవాలనే కోరికతో పెనిమిటికి ఒక లేఖ వ్రాసి పంపింది. నటనలో అరితేరిన ఆ భర్త తన సతి యొక్క స్నేహితురాలి వేషం ధరించి మామగారి గృహంలోని శయన మందిరంలో ప్రవేశించి, తనీ భార్యతో శృంగార కేళిలో గడిపాడు. ఈ క్రమంలో ఆ అసత్యభామ (నిజం కాని భామ – భర్త) తన భామతో కలియడం వల్ల సత్యభామకు (వాస్తవమైన భామకు – భార్యకు) బాలుడు పుట్టాడు. ఆహా! ఎంతగా స్వాంతాన్ని పులకింప జేసే పూరణ ఇది. శాస్త్రిగారు పూరించిన మరొక విచిత్రమైన సమస్య –

'నీవును నీవు నీవు మరి నీవును నీవును నీవు నిక్కమున్'

పూరణ:

ఉ॥ నీవు గజాస్య చంక దిగనీయవు, నన్నసలెత్తుకోవు, నీ
కా వెనకయ్య ముద్దుకొడుకయ్యె గదా! యని యేడ్చు షణ్ముఖున్
దేవి భవాని కౌగిట గదించియు ప్రేముడి ముద్దు గొంచనెన్
నీవును నీవు నీవు మరి నీవును నీవును నీవు నిక్కమున్

ఇది కుమారస్వామికి పార్వతికి మధ్య ముచ్చటైన సంభాషణ. తెలుగు నుడికారం ఇందులోని విశేషాకర్షణ అర్థం సుగమంగా ఉంది కాబట్టి వివరణ అవసరం లేదు. పద్యంలో షణ్ముఖున్(ఆరు ముఖాలు కలవాడు) అన్నపదం సాభిప్రాయం. పద్యంలో నీవు అవే సర్వనామ పదం ఆరుసార్లు ఆవృతమైంది. అది ఆరు ముఖాల కుమారస్వామికి సరిగ్గా సమన్వితమైంది. నీవు నీవు అంటూ ఆరు ముఖాలను 'ఉద్దేశించి ముద్దాడుతూ పార్వతి కుమారస్వామితో ప్రేమతో పలికిందని అభిప్రాయం.

పై రెండు పూరణలలోను నూతన భావకల్పనా చాతుర్యం, పద్యానికి భూషావహమైన భాషాపాటవం గమనింపదగినవి.

## ప్రహేళిక

ఒక పదాన్ని కలిపి చదివితే ఒక అర్థం – విడదీసి పదాలు వేరు వేరుగా చదివితే మరో అర్థం. ఇలాంటివి 'సంస్కృత సాహిత్యం'లో చాలా ఉన్నాయి. ఇపుడొక అలాంటి చమత్కారమైన శ్లోకాన్ని చూద్దాం.

శ్లో: ఏకోనా వింశతి స్త్రీ ణాం
స్నానార్థం సరయూం గతాః ।
వింశతిః పునరామాతాః
ఏకో వ్యాఘ్రేణ మారితః ॥

అంటే ఏకవింశతి = ఒకటి తక్కువ ఇరవై అంటే 19 స్త్రీలు స్నానం చేయడానికి సరసులోకి వెళ్ళారు. వెళ్ళి తిరిగి 20 మంది వచ్చారు. దాంట్లో ఒకడు పులిచేత చంపబడ్డాడు. దీనిలో మనకు అన్ని తికమక వ్యవహారంగా కనబడుతున్నది కదా! 19 స్త్రీలు వెళితే 20 రావడం ఏమిటి? మళ్ళీ ఒకర్ని పులి చంపడమేమిటి? అని. ఐతే దాంట్లోనే ఉంది తిరకాసు. ఏకోన వింశతి స్త్రీలు అంటే ఒక నరుడు 20 మంది స్త్రీలు – ఈ ఏకోనా శబ్దాన్ని విడదీస్తే ఒక నః = నరుడు అని వస్తుంది. మిగతా మామూలు 20 స్త్రీలు తిరిగి వాచ్చరు. ఆ ఒక నరున్ని పులి చంపింది అనే శబ్దార్థం మనకు గోచరమౌతుంది. ఇలాంటి శ్లోకాలు పిల్లలకు చెబితే మెదడుకు పదును పెట్టినమవుతుంది. పదవిజ్ఞానం – అర్థపరిచయం కొంచెం సంస్కృత జ్ఞానం ఉన్నవారికి సులభగ్రాహ్యమే.

- ముత్యంపేట గౌరీశంకర శర్మ

**అవధానకళా చరిత్ర 5**

శతావధాని **ఆముదాల మురళి**

దేవులపల్లి సోదరకవులకు పిఠాపురం అవధానంలో అనువాదం కొరకు ఇచ్చినశ్లోకం కాళిదాస విరచితమని ప్రతీతి. అది ఇలా ఉంది.

"ద్రౌపద్యాః పాండుతనయాః పతిదేవర భావుకాః
న దేవరో ధర్మరాజ స్సహదేవో న భావుకాః"

ఈ శ్లోకాన్ని సోదర కవులు ఇలా అనువదించారు.

"జముకొడు కీదు పట్టియును జన్నపుటోరెపు తేని కందు దూ
ర్వమనియ గాని వెజ్జులకు బుట్టినవాడును బావగార్లు, తేం
డ్లు మఱదు లౌదు రైదుగురిలో గడు జిన్నతడెన్న బావగా
డు మఱది గాడు పెద్దయతడుందగ ద్రోవదికెంచి చూచినన్"

'ద్రౌపదికి పాండురాజు కుమారులైన ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు భర్తలౌతారు, మరదులౌతారు, కాని ధర్మరాజు మరిదికాడు, సహదేవుడు బావకాడు' అన్న శ్లోకంలోని అర్థం చెడకుండా పాండవుల క్రమం తప్పకుండా అచ్చతెనుగులో అనువదించారు. ఈ అనువాదాన్ని చూసి ఇంతరమ్యమైన అనువాదం అవధానాల్లో అసాధ్యమని, దాన్ని సుసాధ్యం చేసిన సోదర కవుల ప్రతిభ అనన్యమని మాడభూషి వేంకటాచార్యులు శ్లాఘించారు.

సోదరకవులు గావించిన మైలాపూరు అవధానంలో 'చంద్రజ్యోత్స్నా స్ఫురతి గగనే పశ్య నీలోత్పలశ్రీః' అని సమస్య నిచ్చారు. అనగా ఆకాశంలో వెన్నెల నల్లకలువవలే ప్రకాశిస్తున్నదని అర్థం. 'వెన్నెల తెల్లగా ఉండాలిగాని నల్లగా ఉండడమేమిటి?' ఇందుకు దేవులపల్లి కవులు చేసిన పూరణ ఇలా ఉన్నది.

జీమూతాళి ర్వహతి మహతీ స్తారకా శ్చంచరీకా
శ్చాంపేయాగ్రే దధతి వలనోల్లాస లీలీమిదానీం ।
చిత్రం మందక్రమ సరత్యద్రి శృంగాగ్రతో౽సౌ
చంద్రజ్యోత్స్నా, స్ఫురతి గగనే పశ్య నీలోత్పలశ్రీః ॥

నక్షత్రాలను మేఘాలు కప్పుతున్నవి. తుమ్మెదలు సంపెంగలపై వాలకుండా వాటి చుట్టూ తిరుగుతున్నాయి. మెల్ల మెల్లగా పర్వతాగ్రం నుండి చంద్రుడు తప్పుకొంటున్నాడు. అనగా చంద్రాస్తమయం కాబోతున్నది. అందువల్ల ఆకాశంలో నీలోత్పల కాంతి కనిపిస్తున్నది. ఇది రమ్యతమమైన పూరణ. అవధాన పద్యాల్లో, ఆశుకవిత్వంలో కవితాశ్రీ దరులొరసిపారినందుకు నిలువెత్తు సాక్ష్య మీ శ్లోకం.

దేవులపల్లి సోదర కవుల అవధానంలో ప్రత్యేక అంశం ఉద్దిష్టాక్షరి. 32 గడులు గల చదరంలో పృచ్ఛకుడు కోరిన సంఖ్యగల గడిని అవధాని అక్షరాలతో నింపాలి. చివరిలో నాలుగు పాదాల అనుష్టుప్ శ్లోకాన్ని ధారణ చేయాలి. పృచ్ఛకుడు 'అంజనేయ స్తుతి' అంశాన్ని కోరగా సోదరకవులు చెప్పిన

సీతాశోకాపహార్థారం వారాశితరణక్షమం
శ్రీరామపాదభక్తం త మాంజనేయం భజామ్యహమ్

అనగా సీతాదేవి దుఃఖాన్ని పోగొట్టినవాడు, సముద్రాన్ని లంఘించినవాడు, శ్రీరామ పాదదాసుడు అయిన అంజనేయుణ్ణి భజించుచున్నానని భావం.

పృచ్ఛకుడు కోరగానే అవధాని పూర్తి శ్లోకాన్ని నిర్మించుకొని తన మనోయవనికపై భద్రపరచుకొంటారు. పృచ్ఛకుని అభీష్టం మేరకు శ్లోకం నుండి అక్షరాలను బయటకు చెబుతాడు. ఈ అంశం మాడభూషి వేంకటాచార్యుల అవధానంలో లేదు. ఇటువంటిదే దేవులపల్లి కవుల అవధానం మరొక్క వినూత్నంశం నిర్దిష్టాక్షరి.

ఇందులో కూడా ఒక చదరంలో 32 గడులు ఉంటాయి. అందులో బేసిగడుల్లో పృచ్ఛకుడు తనకు తోచిన హల్లులు వ్రాసి ఉంటాడు. ఇప్పుడు అవధాని సరిగడుల్ని నింపుతూ, బేసిగడుల్లోని హల్లులకు అచ్చుల్ని కలుపుతూ శ్లోకాన్ని పూర్తి చేస్తాడు. నిర్దిష్టాక్షరిలో దేవులపల్లి కవుల 'శంకరస్తుతి' శ్లోకం ఇలా ఉంది.

కాళీపతే నమో గంగాజటా మౌళే సితాభ తే ।
చంచత్తేజో యతీర్గేయ రమేట్సతేష సుందర ॥

వీరి అవధానంలో మరొక అంశం శ్లోక పూరణ, ఇందులో సంస్కృతంలోని శ్లోకములలో ఒక్కొక్క పాదం ఒక్కొక్క శ్లోకం నుండి ముగ్గురు వేర్వేరు వ్యక్తులు చదువుతారు. అవధాని నాల్గవ పాదం తాను కల్పించి పై మూడింటికి అన్వయం కుదర్చాలి. ఒక అవధానంలో 'అయం సతే తిష్ఠతి సంగమోత్సుకః' అనే శాకుంతల శ్లోకపాదాన్ని ఒకరు, 'విభావరీ భాతి సదంబుజేన' అనే రఘువంశ శ్లోకపాదాన్ని మరొకరు, 'దుద్దుద్వయం కుండల పండితానాం' అనే చాటుశ్లోక పాదాన్ని వేరొక్కరు చదువగా దేవులపల్లి కవులు 'అగ్రేసరో దాతుమనామృగాక్షి' అని నాల్గవ పాదం పూరించి పై మూడు పాదాలకు సమన్వయం కల్పించారు. వీరు అవధానంలో తెలుగులోనే కాక తమిళ ఆంగ్లభాషల్లో కూడా వ్యస్తాక్షరి నిర్వహించారు. వీరి ప్రయోగాలతో అవధానం మరింత వికసించింది.

(సశేషం)

# యయాతి చరిత్ర

## డా. ఆచార్య ఫణీంద్ర

తగ గోట దాచిన మగమానికంబులు
తెలిరంగు లెపుడు వెన్నెలలు గాయ –
మేడలపై నాడు మెలతలు దెరగంటి
కొమ్మలు నే ప్రొద్దు గూడి తిరుగ –
జిలువచామ లగడ్త వలినీటిపై దేలి
యొరిమతో ననయంబు నోలలాడ –
మేలిమి బంగారు మేలి పచ్చల డాలు
మిసిమి మింటికి నెల్లం బసిమి యొసగ –
జదల రాసిన కొమ్మల చాలు కతన
మీద రారాక యల ప్రొద్దు మెరుగు దేరు
గవనులనె రాకపోకలుగా మెలంగ
దనరు బుడమి బ్రతిష్ఠాన మనగ వీడు!

తొలి పూర్తి అచ్చతెనుగు కబ్బంగా "పొన్నికంటి తెలగన" కవిచే రచింపబడిన "యయాతి చరిత్ర"లో అవతారికలోని 75వ పద్యం ఇది. ఈ పద్యంతో తెలగన కవి కథాప్రారంభం కావించి నాడు. అంతకు ముందు 74 పద్య, వచనాలలో కవి – మనం ఇంతకు ముందు చెప్పుకొన్న పద్యాలలాగే కాస్త సుదీర్ఘంగానే, తన ప్రభువు, ప్రభువు కుటుంబసభ్యుల ప్రశంసను కవితాత్మకంగా కొనసాగించాడు. కథా ప్రారంభానికి ముందు ఉన్న వచనంలో పొన్నికంటి కవి –

"...అమీనుఖానుకున్ –
సిరులుం గడు నమరు కొమరులుం గలిగి మనునట్లుగా నా యొనర్పం బూనిన యబ్బురం బగు నిబ్బలు కబ్బంబునకుం బ్రావ యగు త్రోవ యెట్టి దనిన –

(అనగా .. మిక్కిలి ఐశ్వర్యాలతో తులతూగు కుమారులచే అమీనుఖాను చిరకాలము జీవించాలని ఆకాంక్షిస్తూ, తాను రచింప బోవు ఈ అచ్చెరువు గొలిపే మహా కావ్యానికి అరంభ మార్గం ఏదంటే...) అంటూ పేర్కొనడం గమనార్హం.

ఇక .. కథారంభం చేసిన కావ్యంలోని ఈ 75 వ పద్యంలో ప్రతిష్ఠానపురమనే నగర వర్ణనను వెలయించాడు కవి. ఈ అచ్చ తెనుగు పద్యంలో – మగమానికంబులు (వజ్రాలు); తెలిరంగులు (ధవళ కాంతులు లేక తెలతెల్లని వెలుగు రేకలు); మెలతలు (వనితలు); తెరగంటి కొమ్మలు (తెరచియున్న కన్నులు గల స్త్రీలు .. అనగా అనిమిష స్త్రీలు లేక దేవతా స్త్రీలు); చిలువ చామలు (నాగకన్యలు); అగడ్తలు (కందకాలు); వలినీరు (చల్లని నీళ్ళు); ఒరిమతో (ఆసక్తితో – లేక – స్నేహ పూర్వకంగా);




పచ్చలడాలు (పచ్చలు పొదిగిన ధ్వజ కాంతి); చదల రాసిన కొమ్మల చాలు కతన (నింగికి ఒరసుకొంటున్న కోట గోపురాల వరుసల కారణంగా); ప్రొద్దు మెరుగు దేరు (సూర్యుని కాంతివంతమైన రథం); గవనులనె రాకపోకలుగా మెలంగ (గోపురాల వద్దనే తిరుగాడుచుండగా); వీడు (నగరం లేక పట్టణం).. మొదలైన అచ్చ తెనుగు పదాలను ప్రయోగిస్తూ చేసిన కూర్పు... ఈ తరం పాఠకులకు ఇతర మార్గకవితా గ్రంథాలలో గాని, నిత్య వ్యవహారాలలో గాని కనిపించక, వినిపించక .. ఒక పట్టాన కొరుకుడు పడదు.

కోటలో దాచిన వజ్రాల ధవళ కాంతులు ఎప్పుడూ మింటిపై వెన్నెలలై ఒప్పారునట్లుగా వ్యాపిస్తుంటే, ఎత్తైన భవనాలలో జీవించు రాణివాసపు స్త్రీలు ప్రతి దినమూ – దేవతా స్త్రీలతో కలసి తిరుగుతుంటే, లోతైన కందకాలలోని చల్లని నీళ్ళలో నాగకన్యలు ఆసక్తితో ఎల్ల వేళలా మునిగితేలుతుంటే, మెరుగైన పచ్చలు పొదిగిన మేలిమి బంగారపు ధ్వజ కాంతులు ఉదయిస్తున్న వేళ ఆకాశమంతటికీ బంగారు కాంతులను అందిస్తుంటే, నింగిని ఒరుసుకొన్నట్టుగా ఉన్న కోటల గోపురాల వరుసల కారణంగా సూర్యుని కాంతివంతమైన రథం అవి దాటి ముందుకు రాలేక, ఆ గోపురాల వద్దనే అటూ ఇటూ తిరుగాడుతుంటే – ప్రతిష్ఠానమనే పేరు గల నగరం భూమి మీద ప్రకాశిస్తున్నది – అని పద్యం తాత్పర్యం.

కావ్య సంప్రదాయాలలో పుర వర్ణన ఒక విశేషాంశం. పొన్నికంటి తెలగన కవి ఈ తొలి అచ్చ తెనుగు కబ్బంలో కూడ ఆ సంప్రదాయాన్ని పాటిస్తూ, ఆ పురవర్ణనకు స్థానం కల్పించాడు. ప్రతిష్ఠానపురమనే పట్టణ వైభవాన్ని – వజ్ర వైఢూర్య ఐశ్వర్యాలతో; ఎత్తైన భవనాలు, దేవతా స్త్రీలతో సమానమైన సంపద, సౌందర్యాలతో వెలిగే కాంతల కాంతులతో, నింగినంటే కోట గోపురాల వరుసలతో, పచ్చలు పొదిగిన బంగారు ధ్వజ స్తంభాలతో విలసిల్లుతున్నదని వర్ణిస్తూనే, అక్కడ విష నాగులు జీవిస్తున్న లోతైన అగడ్తలు కూడ ఉన్నాయని పేర్కొంటూ, ఆ రాజ్య భద్రతా పటిష్ఠతను కూడ సూచించడం .. కవి చమత్కార సామర్థ్యానికి నిదర్శనం!

ప్రతిష్ఠానపురం అన్నది పురాణాల కాలం నుండి ప్రసిద్ధి పొందిన చారిత్రక పట్టణం. ప్రస్తుతం మహారాష్ట్రలోని ఔరంగాబాద్ (ఇటీవలే దీని పేరు "ఛత్రపతి శంభాజీనగర్" గా మార్చారు) సమీపంలోని "పైఠాన్" పట్టణమే ఈ ప్రతిష్ఠానపురం అని చరిత్రకారుల అభిప్రాయం.

# రసపోషణ

"శృంగార ఏకోవై రసః". శృంగార మొక్కటే రసమని భోజుని యభిప్రాయము. ప్రతి రసమునకును ఒక స్థాయిభావముండును. కావ్య ఘట్టము ఆ స్థాయిభావమును సంతరించుకొన్నప్పుడు తత్సంబంధ రసపోషణ జరుగవలెను. జరిపించుట కావ్యకర్త కర్తవ్యము. అద్భుతరసమునకు తక్క తక్కిన యే రసమునకైనను కనిష్ఠ గరిష్ఠ పరిమితులుండును. అద్భుతరసమునకు స్థాయి భావము విస్మయము. దీనికి అవధులుండవు. అవధులు దాటిన స్థితియే విస్మయము. మిగిలిన రసములలో సందర్భోచితముగా కవి పైన చెప్పబడిన అవధులకు లోబడి రసనిర్వహణ చేయును.

శృంగారము నవరసములలో రాణి వంటిది. ఈ రస నిర్వహణమున సందర్భోచితముగా, కవి సంస్కారము ననుసరించి "మలినామలినములు" గ్రంథములో నేర్పడుచున్నవి. సందర్భము సూచించిన తీవ్రతను దాటి కవి యూహించుట వలన గానీ, తన యూహాప్రపంచములో నేర్పడిన భావతీవ్రతను ప్రకటించుటలో నిగ్రహము పాటించక పోవుట వలన గానీ కావ్యములో "అమలిన శృంగారము" చోటుచేసికొనును. కొండొకచో కవి నిగ్రహము కోల్పడుటవలన తత్తద్వర్ణనముల యందు రసాభాస మగుటకును ఆస్కారమున్నది (ఉదా: కూచిమంచి జగ్గకవి - చంద్రరేఖావిలాసము).

అందువలన, కావ్యమునం దొక శృంగార సన్నివేశ మెంతటి లోతైన, విశదమైన వర్ణనమును కోరుచున్నను కవి యాత్మ నిగ్రహమును పాటించి, తక్కువ చెప్పి, యెక్కువ పాఠక హృదయ సంస్కారమునకు విడిచి "కావ్యకన్య" యొక్క మర్యాదను కాపాడవలెను. అట్టి సంస్కారవంతులైన వారిలో ప్రథమగణ్యుడు ఆదికవి నన్నపార్యుడు.

ఈ క్రింది పద్యమును పరికించినచో

ఉ. దాని శరీర సౌరభము, దాని విలోల విలోకనంబులున్,
దాని మనోహరాకృతియు, దాని శుచిస్మిత వక్త్రకాంతియున్,
దాని విలాసమున్ గడు ముదంబున జూచి మనోజబాణసం
తానహతాత్ముడై నృపతి దానికి నిట్లనియెం బ్రియంబునన్

(ఆది-4- 72)

మృగయావినోదార్థము యమునాతీరమున కేగిన శంతనుడు యోజనగంధియైన సత్యవతి సౌందర్యదర్శనము చేసిన సందర్భమిది.

శంతనుడు మనోజబాణసంతాన హతాత్ముడైనాడు. ఇచ్చట సందర్భానుసారముగా విషయమును పాఠక హృదయాకర్షకముగా

# పద్యపరిమళం

- అన్నమరాజు ప్రభాకరరావు

చెప్పుటకు అంగాంగ వర్ణనమెంతైనను చేయవచ్చును. కానీ, నన్నయ పురోహితుడు. సంస్కారి. చాలా సున్నితముగా యోజనగంధి యొక్క శరీర సౌరభము, ఆమె చురుకైన కన్నులు, ఆమె దరహాసకాంతులు, ఆమె మనోహరాకృతి, ఆమె యొయ్యారమును చెప్పి శంతనుడు మన్మథబాణహతుడైనా డనినాడు. ఆపై సహృదయ పాఠకుల సంస్కారమునకు వదిలి వేసినాడు. పద్యము మొత్తము "దాని" చుట్టూనే అల్లినాడు కానీ దాని లోపలికి పోలేదు. పాఠకుని పంపినాడు. షష్ఠ్యంత తచ్ఛబ్ద ప్రయోగము మంత్రప్రయోగమై పాఠకుడు కూడా యోజనగంధి శరీర సౌరభము నాఘ్రాణించి, విలాస విలోకనములను, శుచిస్మిత వక్త్రకాంతులను, మనోహరాకృతిని గాంచి శంతనునితో సహానుభూతిని పొందినాడు. ఇదీ శృంగార రస నిర్వహణమును మర్యాదాతిక్రమణము చేయకుండా చేయుట.

దీని తలదన్నే పద్య మింకొకటి:

అంగరాజైన రోమపాదుడు వర్షాభావ పీడితుడై, తరుణోపాయము గోరి బ్రాహ్మణుల సూచన మేరకు ఋష్యశృంగుని రప్పింప "విదగ్ధ వేశ్యాంగనల"ను నియోగించినాడు. వారిలో నొక "అభినవ యౌవన విలాస విభాసిని" చనవు తీసికొని, స్నేహము నటించి "విరచితాలింగనయై మునిపతికి ముదము గావించి"నది. ఆమెను ఋష్యశృంగుడు మునికుమారునిగా భ్రమించినాడు. ఆ తరువాత జరిగినదాని విస్తృతిని సూచించుట కొక "సీస పద్యము"ను, విలాసమును తెలుపుటకు ఎత్తుగీతిగా "ఆట వెలదిని", తత్ఫలితానందమును చెప్పుటకు "కంద ద్వయము"ను, ఆ మనోహరభావము కొనసాగినదా యన్నట్లుగా నిర్నిబంధమైన "వచనము"ను ఔచితీమంతముగా ప్రయోగించినాడు. ఎక్కడ వచనము చెప్పవలెనో, ఎక్కడ పద్యము చెప్పవలెనో, ఆ పద్య మే ఛందస్సులో చెప్పవలెనో చక్కగా తెలిసినవాడు నన్నయ.

తన అనుభవమును ఋష్యశృంగుడు తండ్రియైన విభాండకునికి వివరించునప్పుడు నన్నయ పాటించిన యౌచిత్య మనుపమానము.

ఉ. నన్నును గౌగిలించుకొని, నా వదనంబునకున్ నిజాస్య మా
సన్నము జేసి, యొక్క మృదుశబ్దము సేసె మనోహరంబుగా,
నెన్నడు నట్టి శబ్దము మునీశ్వర! మున్ విని యే నెఱుంగ, న

(మిగతా 16వ పేజీలో)

# విశిష్ట తెలుగు భాషా వైభవం- ఛందః ప్రాముఖ్యం

5

- డా. సంగనభట్ల నరసయ్య

వచనానికి కొలత అక్కర్లేదు. కొలతలేనిదే లయలేదు. లయ లేక గానమూ లేదు. జ్ఞాపకమూ ఉండదు. లయ జ్ఞాపకశక్తికి ఒక మందుగుళిక. లయ ఆనందకళిక. లయ గేయంలోని మొదటి పాదపు కొలతతో శ్రోతృ హృదయంలో తిష్టవేస్తుంది. పాట అంతం దాక ఒకే కొలతగల పాదాలతో పుడుతున్న లయ శ్రోతను గాయకునికి అభిముఖుణ్ణి చేసి నడుపుతుంది. లయతో శ్రోతృ హృదయం గాయకుని హృదయలయతో సంవదించి ఆనందాన్ని పొందుతుంది. బృందగానంలో చరణం గాయకుడు పూర్తిచేసి వెంటనే అలనందుకునే పల్లవికి బృందసభ్యులు గొంతు కలిపే లెక్క, వారికి ఈ లయవల్లే తెలుస్తుంది. సమాంతర కాలఖండాల పౌనఃపున్యం లయ. కాలఖండాలు పమానంగా పేరుస్తూ పాదం ఒక కాలఖండంగా పాదంలోని "సమానంగా విడిపోయిన సరిసంఖ్యలోని ముక్కలు" కాలఖండాలుగా పునః పునః అవృత్తి కావడం వల్ల మనిషిలోని సహజాతమైన లయ నిద్ర మేల్కొంటుంది. సృష్టిలో కాలమే లయాధీనం ఉదయాస్త-మయాలు, ఋతువులు, కాలాధీనాలు, క్రమాధీనాలు, ఆలోచనా శక్తి, వాక్శక్తి లాగే లయ జ్ఞానం మనిషికి పుట్టినపుడే ఉంటుంది. అందుకే పాటతో పసివాడు నిద్రిస్తాడు. జోలపాటకు వచనం పనికిరాదు. నిద్ర అస్సలు రాదు. లయలేక పాట లేదు. ఛందస్సు లేక కవిత్వం లేదు. అందుకే 'ఇచ్ఛదువు' లేక కవి ఎలా అవుతాడని తెలుగులో తొలి ఛందః కర్త వేములవాడ వాసి క్రీ.శ. 10వ శతాబ్దం వాడైన కవిజనాశ్రయ కర్త మల్లియరేచన ప్రశ్నించినాడు. 'ఛందో హీనో న శబ్దోఽస్తి, నచ్ఛందః శబ్ద వర్జితం' అని నాట్యశాస్త్రోక్తి ఛందస్సంటే లయ అనుకున్నట్లే లయ ఉచ్ఛ్వాస, నిశ్వాసాలకు ఆలంబనం. కుదురుగా కూర్చుండి నిశ్శబ్దంగా వచన కవిత్వం చదువుకునే వానికి అక్కర్లేదు కాని, పాడేవానికి పదం కలిపే వానికి, నాట్యకారునికి శ్వాసకు లయ సంబంధం ఉంది. ఉచ్ఛ్వాసతో మనిషికి ప్రాణాల, నిశ్వాసతో గానం (వర్ణాలు, శబ్దాలు) పుడతాయి. అందుకే పాదాంతంలో విరామం. విరామంలో ప్రాణం నిలుపుకొంటాడు. లయను కలుపుకుంటాడు.

పాదపు కొలత ఒక మూసగా పాదాలు ఆ మూసలో పోసిన ఒక క్రమమైన కొలతగా కవి పాదాలు పేరుస్తూ పోతాడు. పాదం కొలతకు నిశ్వాస ప్రయాణం. పాదంలో వాడిన పదాలు కాలఖండాలుగా తరువాతి పాదాల్లో అంతే కొలతతో విరామాలు పొందుతూ నడుస్తాయి. తొలుత వేలాది సంవత్సరాల క్రితం పాట ఇలాగే ఉంటుంది. పుట్టిందనడానికి సమకాలీన అనుభవం ఒకటి వివరిస్తాను. నాకు తెలిసిన మా బంధువుల్లోని ఒక స్త్రీ తన కూతురు చనిపోగా, శవము వెంబడి శ్మశానానికి వచ్చి బంధువులందరు వింటూండగా తన కడుపు చిచ్చును, హృదయ విదారకంగా ఎలుగెత్తి శోకలు పెట్టింది. ఆ తల్లి పల్లెటూరి మనిషి నిరక్షరాస్య ఐనా ఆమె అప్పటికప్పుడు ఆశువుగా తన రోదనమంతా పాటలా శోకిస్తూ ఏకరవు పెట్టింది. ఆమె రోదనమంతా ఛందోఛాదనముతో ఆవిష్కరింపబడి, మాటల పొందికలో, కూతురి జీవిత కథనంగా, వచ్చిన బంధువులందరిని ఆకర్షించగల్గింది.

నాకంటే ముందే బిడ్డా
నువ్వేపోయినావ బిడ్డా
ఎన్ని జన్మల పాపం బిడ్డా
ఇవ్వాళే కూడిందా బిడ్డా
కడుపులోని దుఃఖం బిడ్డా
ఎంతకూ ఆగదే బిడ్డా
ఎందు బోయితివె బిడ్డా
ఏడ బోయితివె బిడ్డా

ఈ రీతిగా సాగింది ఏడ్పు. ఆవేశపూరితుడైన మనిషి తన భావతీవ్రతను ఏ విధంగా బయటపెడతాడో ఇది ఉదాహరణంగా చెప్పవచ్చు. ఈ శోకం గేయరూపంగా నడవడం ఆమెకు సహజం, ఛందోవిశ్లేషణకు మాత్రం విశేషం.

ఆ తల్లికి కవిత్వీకరణం, గేయనిర్మాణం తెలియదు. కాని హృదయవేదనను వ్యక్తం చేసేందుకు గానం వాడుకుంది. వ్యక్తీకరణం ఆశువుగా సాగింది. ఛందస్సంటే తెలియకున్నా మాత్రసమత, సమకాలఖండాలు, సమపాద దైర్ఘ్యం పాటించింది. పాదం ఎంతదాక నడపాలో తెలియకున్నా, ఉచ్ఛ్వాస, నిశ్వాసలు, తన దమ్ము(మొస) చూసుకుని పాదం తెలిపింది. లయ తెలుసు. లెక్క తెలువదు. శ్వాస తెలుసు. పాదం కొంత తెలువదు. పదాల(కాలఖండాల) పేర్పు తెలుసు. గణాలు తెలువదు. పదావృత్తి(బిడ్డా! అని) పాటించడం తెలుసు. అంత్యప్రాస తెలువదు. సహజకవిత్వాన్ని శాస్త్రం పొగడిస్తుంది. ఇది తొలినాళ్ళ ఛందస్సు పుట్టుక.

(సశేషం)

## కాశీలో దర్శనమ్ అవధాన సప్తకం

### 'శతావధాన విద్వన్మరాళ' శ్రీ ఆముదాల మురళి గారి అష్టావధానం

**సంచాలకులు:** కోట లక్ష్మీనరసింహం 26.07.2025

**నిషిద్ధాక్షరి:** చింతారామకృష్ణారావు

**అవధాన శిక్షణశిబిరాన్ని శతావధాన భారతిగా భావిస్తూ..**

శ్రీకారేతరవర్ణనిషేధం శ్రీ(మ)వా(గ)ణీ(-)రూ(ప)ఢిన్(-)దా(స)చేవ(న)గ నిల్పు(న)త(-)స(ద)మ(స)గ్రచి(త)న్ము(ద)ఖ(-)మై(స)వే

కం. శ్రీవాణీరూఢిన్ తా
చేవగ నిల్పుత సమగ్ర చిణ్ముఖమై వే
దావనదీక్షగా విద్యల
నావగ పరిషత్తు వెలుఁగనారతమగుచున్

**సమస్య:** భైరవనేని పోతురాజు చౌదరి

**మరదియె మగడయి మగువకు మాన్యత పెంచెన్**

కం. స్థిరతరధర్మంబునకును
వరసత్యావన సుదీక్ష పాలన సేయన్
నరుడగు పార్థుడు కృష్ణుని
మరదియె, మగడయి మగువకు మాన్యత పెంచెన్

**దత్తపది:** మరుమాముల అపర్ణ

**కేశవ - మాధవ - గోవింద - ముకుంద**

**పరమశివుని వర్ణన. (స్వేచ్ఛా ఛందం)**

తే.గీ. భక్తుల కిదిగో **విం**దగు వారణాసి
హరుని **కేశవ**ల్లరి కటాహంబుగాదె
హే!ఉ**మాధవ** శంకరాహీంద్రహార!
కొల్తు కాపాడు మ**ము కుంద**కుంద స్వామి!

**వర్ణన:** మరుమాముల శశిధర్ శర్మ

**గత రెండురోజులుగా జరుగుతున్న అవధానక్రతువును చూస్తూ ఆనందంతో పరవశురాలై విద్యాసరస్వతి చేస్తున్న ఆనంద లాస్యం - స్వేచ్ఛా వృత్తం**

శా. హృద్యాపూర్వ విలాసభావనలతో హేరాళభక్తిప్రభా
పద్యోద్దీపిత వేదికానటన సంపత్కావ్యశైలూషికా
మాద్యత్ప్రేక్షక సద్వధాన విపులాంబఃపూర్ణవారాశియై
విద్యాదేవి నటించుచుండునెదలన్ వేదోక్తసూక్తంబులై

**న్యస్తాక్షరి:** డా.గొట్లూరి సురేష్ బాబు

**ఉత్పలమాల 1-10-వా, 2-7-ర, 3-13-ణా, 4-17-సి**

**దర్శనం, మరుమాముల గారి సాహిత్య సేవ**

ఉ. భారతిపాదపద్మములవారిత భక్తిని గొల్చు యజ్ఞమై
సారవధాన ధారలకుసత్కృతిసల్పెదు మండపంబునై
ధీరవరేణ్యులుత్తములు తీవ్రగుణావళి దూరులున్ మహా
దారులు ప్రస్తుతింపగను దర్శనమొప్పును రాశివాసియై




**ఛందోభాషణం:** 'శతావధాని' నారాయణ సుబ్రహ్మణ్యం

**పృ. అవధానాధ్వరమందు మీరు కనగా ఆచార్యులా? వర్యులా?**

అ. అవధానంబున నేను శ్రామికుడ దీవ్యత్ సౌధనిర్మాణమున్
వ్యవధానంబునులేక సల్పెదమొ (పృ)**అయ్యా!భారతీ దేవి మీ స్తవనీయోజ్జ్వలభాషణంబులిటులన్ సంధింపనేహేతువో**

అ. కవనార్థంబుదయించినట్టి గురులన్ కాల్మ్రొక్కి సేవించుటే

**పృ. గురులెవ్వారలు తీర్చిదిద్దిరిటులన్ కూర్మిన్ నినున్ మిత్రమా**

అ. గురునామాంకిత శ్రీ ప్రకాశవిభుడే గోవిందుడై భక్తునిన్
మురళిన్ గాచిన దేశికోత్తముడు సంపూజ్యుండు పద్మప్రభా
కరుడై వెల్గిన సద్గుణోత్తముడు తత్కారుణ్యమగ్గించెదన్

**ఆశువు:** శిఖా గణేష్

**ఆదిశంకరుల చతురామ్నాయపీఠాలు గురించి**

ఆ.వె. నాల్గువేదశిఖల నాల్గు వాక్యంబుల
నేల నాల్గు దిశల నెరపనెంచి
శంకరార్యులిడిన సత్యప్రసాదముల్
నాల్గు పీఠములకు నతులుజేతు

**కాశీ విశాలాక్షి అమ్మవారి వైశిష్ట్యం**

తే.గీ. విశ్వనాథుని లయకర్తృ విపుల శక్తి
వ్యాసమునిరాజ నిగమ విన్యాస శక్తి
భారతీయాత్మ సంపన్న భావ శక్తి
శక్తులకు శక్తి అవధాన సర్వ శక్తి

**అప్రస్తుతం:** శ్రీ పంతుల తపస్వి గారు

**ప్ర: భావావేశం, బావావేశం లకు తేడా ఏంటి.**

స: ఒకటి మానసికం, మరొకటి శారీరకం. మహాప్రాణాలు, అల్పప్రాణాలు..

**ప్ర: పెళ్ళిలో అల్లుడి కాళ్ళు మామగారు ఎందుకు కడుగుతారు?**

స: ఎక్కడో తొక్కి న బురదంతా కడగడానికి

# గాడేపల్లి కుక్కుటేశ్వరరావు అవధానము

## రాజమండ్రి ప్రభుత్వ కళాశాల; తే.31-07-1971

**వర్ణన:** చంద్రమండలముపై కాలుపెట్టిన 'నీల్ ఆమ్‌స్ట్రాంగ్ ఊహ.

చం. ఇది యత్యద్భుతచంద్రసీమ, యిటకేనే తెంచి యీనాడు మత్
పదమునన్ మోపితి దేహమెల్ల పులకల్వారెన్ సమగ్ర ప్రజా
భ్యుదయంబై దివి చేతికందినదిపో భూలోక నాకమ్ములే
విదితస్ఫూర్తిని వియ్య మందుకొనె భావిన్ గీర్తి రంజిల్లగన్.

**దత్తపది:** "జనవరి, మార్చి, మే, జులై" అను పదములతో భారతార్థములో.

చం. విను విను మార్చియార్చి, రిపువీరుల నెంతటి మేటిరాజు లై
నను రణమేదినిన్ నిలచి నన్నును నిన్నుఁ దిరస్కరించి మే
నన విజయా! చనంగలరె! నాకును బుట్టుకనుండి నీవునుం
జనవరివౌటఁ దెల్పితి వెసన్ మఱి లెమ్ము రణమ్ము సేయఁగా.

**నిషిద్ధాక్షరి:** "భారత దేశ స్తోత్రము."

కం. హితదేవీ! మాతా! భా
రతి! జయశబ్దాఖ్య! ప్రస్ఫురద్భావాత్మా!
నుతిమూలా! సుస్థిత! వి
ధ్గత (చరితులఁ గన్న పుణ్యధాత్రీ! నేత్రీ!)
(కుండలీకరణమున ఉన్నది నిషేధింప

**సమస్య:** "మదగజయానకున్ రవికె మాత్రమె చాలును చీర యేటికిన్

చం. హృదయమునందు భగ్గుమనియెన్ ధృతరాష్ట్రుని యగ్రసూతి క
య్యదనున నవ్వ ద్రౌపది; రయంబున తమ్ముని బిల్చి గర్వమే
పొదవ వచించె నిండుసభ నొల్వుము చీరల నిద్దురాత్మయౌ
మదగజయాసకున్ రవికె మాత్రమె చాలును చీర యేటికిన్.

**వ్యస్తాక్షరి:**

| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| గ | త | కా | ల | మె | మే | లు | వ | చ్చు | కా | ల | ము | కం | టెన్ |

**పురాణము:** భారత - విరాట పర్వము వివరింపఁబడినది.

**వారకథనము, అప్రస్తుత ప్రసంగము** సముచిత రమణీయములుగా నిర్వహింపఁబడినవి.

***

*కాకినాడ సూర్యకళామందిరములో తే10-01-1970న జరిగిన భువనవిజయంలో ఒక సమస్యకు 'తెనాలి రామకృష్ణుడి'గా ఊహించుకొని 'గాడేపల్లి కుక్కుటేశ్వరరావు' చెప్పిన పద్యం*

**సమస్య:** ఒకరా! యిద్దర! ముగ్గురా! నలుగురా! ఉన్నార లెందెందరో!

ఒక తాతంగని యూతునాయనుచుపై నుమ్మేసితిన్; ప్రెగ్డరాట్
సుకవీంద్రున్ విరసా! తుసా! బుస! యటంచుం దిట్టితిన్, దోమకు
త్తుకలో నెక్కడఁ జొచ్చె లంజెకొడకా దుర్దాంతమౌ కుంజర
ప్రకరం బంచౌక పండితున్ దెగడితిన్, పంతమ్ము దీపింప పి
ల్లికి పాల్వోయక నేనెత్రావి యిసి పాలే యొల్లదీ పిల్లికూ
న కటా! యంచును దానిమాడ్చితిని, నానా బ్రాహ్మణవ్రాతమిం
టికి రాన్ మజ్జనయిత్రి చచ్చునెడ తండ్రీ! వాతలో వాతలం
చు కనుల్ మూసినదంచు వీవుపయిఁ బెచ్చుల్ లేవ నంటించితిన్,
ఒక యుద్ధండుని బట్టి యర్థమది యేదో తేల్చుమీ యంచు మే
కకు తోకా తొకతోక మేకతొకతోకా యంచు వల్లించి గ్రు
డ్లకు నీర్దిర్గ నొనర్చితిన్ వికటలీలన్ - మత్పరాభూతు లి
ట్లొకరా! యిద్దర! ముగ్గురా! నలుగురా! ఉన్నార లెందెందరో!

**కాశీలో దర్శనమ్ అవధాన సప్తకంలో భాగంగా 26.07.2025న జరిగిన 'శతావధాన విద్వన్మరాళ' శ్రీ ఆముదాల మురళి గారి అష్టావధానం**



**ద్రుపదుడు రాజు తత్పురికి, దుండిల ధృత్యధరీకృతామర**
**ద్రుపదుడు, నమ్ర దుర్మద విరోధి శిరోధి మణీఘృణిస్ఫుర**
**ద్విపదుడు, చక్రవాళ పరివేష్టిత భూ భువనార్థి సైంధవ**
**ద్విపదుడు, శాశ్వతాత్మ శమభిద్విపదుండు నృపాల మాత్రుడే**

ఈ పద్యం కాకమాని మూర్తి కవి రచించిన పాంచాలీ పరిణయం అనే అద్భుతమైన ప్రౌఢకావ్యం లోనిది. పదహారవ శతాబ్దం వాడుగా చెప్పబడుతున్న ఈ కవి అందమైన పద్యానికి అసలు సిసలు చిరునామా. "న దైవం కేశవాత్పరం" అని తన ఈ కృతిని శ్రీరంగ పతికి, రాజవాహన విజయం అనే కావ్యాన్ని శ్రీవేంకటపతికి అంకితం చేశాడు. పాంచాల దేశపు రాజధాని కాంపిల్యపుర వర్ణన తదుపరి ఆ దేశ రాజు ద్రుపదుని వర్ణన ఈ పద్యం. అంత్యప్రాసతో అందంగా అలరించింది పద్యం. ఆ పురికి రాజు ద్రుపదుడు. ఇతడు – **"దుండిల ధృత్యధరీకృతామర ద్రుపదుడు"**

తుందిలము, దుందిలము రెండు పదాలూ ఉన్నాయి నా పరిజ్ఞానం మేరకు. ఈ **దుండిల+ధృతి+అధరీకృత+అమరద్రు+పదుడు.** దుందిలము అంటే పెనుమ్రాను, దానిని జయించిన కల్ప వృక్షము (అమరద్రు) పాదముగా గలవాడు. ద్రుపదుడు అంటే వృక్షము వలె ఉన్నతమైన స్థానం కలవాడు అని నిఘంటువు. అలా కల్పవృక్షము వలె కోర్కెలు తీర్చేవాడుగా భావించాలి. తుందిల అంటే అధికమైన అనే అర్థం తీసుకుంటే అధిక మైన ధైర్యమును అధఃకరించువాడు

**"నమ్ర దుర్మద విరోధి శిరోధి మణీఘృణిస్ఫుర ద్విపదుడు"**

శిరోధి అంటే మెడ. విరోధుల మెడలలోని మెరుస్తున్న హారాలకు తన పాదాల వద్ద విపత్తు తెచ్చే వాడు (స్ఫురత్+విపదుడు).

**"చక్రవాళ పరివేష్టిత భూ భువనార్థి సైంధవ ద్విపదుడు"**

చక్రవాళం(లోకాలోక పర్వతం)చే చుట్టబడిన భూమిపై (యావద్భూలోకంలో) గల సైంధవుని లాంటి రాజులకు ఏనుగు (ద్విపము) లాంటి వాడు. అర్థి సైంధవ అంటే సైంధవులను (గుర్రాలు) యాచించేవారికి అంటే ఔచిత్యంగా ఉండదు.

**"శాశ్వతాత్మ శమభిద్విపదుండు"** – ఈ పదబంధం భిత్ అనే ప్రత్యయం ద్వారా కొంత విపరీతార్థాన్ని ప్రకటిస్తున్నట్లు కనబడుతోంది. శాశ్వతమైన ఆత్మ నిగ్రహం(శమ)తో విభేదించే ద్విపదుడు (నరుడు). అంటే మానవాతీతుడుగా అర్థం చేసుకోవచ్చు. అందుకే వెంటనే నృపాల మాత్రుడే అని చెప్పారు కవి. సాధారణ రాజు మాత్రమే కాదు. ఇన్ని గొప్ప లక్షణాలు ఉన్నాయి కాబట్టి.

**- చేపూరి శ్రీరాం, హన్మకొండ**

## పద్యపరిమళం

**భారత, భాగవత, రామాయణ గ్రంథములు** (పంగిడి గూడెం శతావధానంలో కొప్పరపు కవుల చక్కని పద్యం)

**విజయ విక్రాంతి విదితముల్, విశ్వరిపు వ**
**రోగ్ర సేనోద్భవస్మయ నిగ్రహములు**
**పుణ్యజనవర్ధన క్రియాస్ఫూర్జితములు**
**పాండు, వసుదేవ, దశరథ భవుల కృతులు**

**తాత్పర్యం:** పాండు, వసుదేవ, దశరథ భవుల కృతులు: పాండురాజు (మహాభారతం), వసుదేవుడు (భాగవతం), దశరథుని కుమారుడయిన శ్రీరాములకు (రామాయణం) సంబంధించిన భారత, భాగవత, రామాయణాల వంటి పుణ్యమైన గ్రంథాలు.

**విజయ విక్రాంతి విదితముల్:** యుద్ధాలలో విజయం మరియు పరాక్రమాలతో ప్రసిద్ధి చెందినవి.( భారతం)

**విశ్వరిపువరోగ్ర సేనోద్భవస్మయ నిగ్రహములు:** లోకానికి శత్రువులైన బలమైన సేనల గర్వాన్ని అణచివేసినవి.( భాగవతం)

**పుణ్యజనవర్ధన క్రియాస్ఫూర్జితములు:** మంచివారిని అభివృద్ధి చేసే కార్యాలతో ప్రకాశించేవి. (రామాయణం) – ఇది పైకి కనిపించే ఒక అర్థం. మరొక అర్థం – ఈ పద్యం భారత, భాగవత, రామాయణాల చరిత్రలను అద్భుతంగా వర్ణిస్తుంది. ప్రతి గ్రంథానికి సంబంధించిన ప్రత్యేకమైన అర్థాలు ఈ పద్యంలో దాగి ఉన్నాయి.

**మహాభారత పరంగా:** భారత కథలు విజయ అంటే అర్జునుని విక్రాంతి అంటే పరాక్రమాలతో ప్రసిద్ధి చెందినవి. కురుక్షేత్ర యుద్ధంలో అర్జునుని (విజయ) పరాక్రమాన్ని మహాభారతం వివరిస్తుంది.

**భాగవత పరంగా:** భాగవత కథలు విశ్వరిపు అంటే లోకానికి శత్రువైన ఉగ్రసేనుని కుమారుడైన కంసుని గర్వాన్ని అణచివేసిన ఇతివృత్తాల ప్రఖ్యాతి కలిగినవి. భాగవతంలో శ్రీకృష్ణుడు కంసుని గర్వాన్ని అణచివేసిన వృత్తాంతం ప్రధానమైనది.

**రామాయణ పరంగా:** పుణ్యజనులు అంటే మరొక అర్థంలో రాక్షసులు.( పుణ్యః విరుద్ధలక్షణయా పాపీ జనః విరుద్ధలక్షణతో పాపాత్ముడు; రాక్షసుడు.) వారి క్రియలకు పిడుగులు లాంటివి. అంటే, రాక్షసుల కార్యాలను, దుర్మార్గాన్ని నాశనం చేసే కథలు కలిగినది రామాయణం అని అర్థం. రామాయణంలో శ్రీరాముడు రాక్షసులైన రావణాసురుడు, ఇతర రాక్షసులను సంహరించిన కథలు ప్రసిద్ధాలు.

పాండురాజు, వసుదేవుడు, రాముడు అనే రాజుల చరిత్రలు ఇవి అని స్పష్టం చేస్తూ ఈ ఒకే పద్యంలో మూడు గొప్ప ఇతిహాసాల ముఖ్య లక్షణాలను వేర్వేరు అర్థాలతో, ఎంతో నైపుణ్యంగా వివరించిన కొప్పరపు కవుల రచనా పటిమకు శిరసా నమామి.

**- ఆచార్య తాడేపల్లి పతంజలి**

# పూరణతోరణం

నిర్వహణ: 'అష్టావధాని' కంది శంకరయ్య

## సమస్య

తల్లినిఁ దన్ను పుత్రులకె దక్కును గౌరవ మీ వసుంధరన్

**అన్నపరెడ్డి సత్యనారాయణ రెడ్డి, హైదరాబాదు**

కల్లల నాడుచున్ సతము కాఱియ పెట్టుచు పేదవారి కో
కొల్లల సంపదల్ శ్రమను క్రూరపథమ్మున తస్కరించుచున్
పల్లెల లోని భూములను పంటల కాల్చుచు, నన్నమిచ్చు నా
తల్లిని దన్ను పుత్రులకె దక్కును గౌరవ మీ వసుంధరన్.

**ఆరవల్లి శ్రీదేవి, హైదరాబాదు**

చెల్లగదంద్రియానతియు శీఘ్రు ము భక్తిని గొల్చి మ్రొక్కగా
నుల్లము దిట్టమైపరశునూర్మిలిబాపగశీర్షఖండనం
బల్లన జేసి వెండియుసురందగ జేసెను భార్గవుండటన్
తల్లిని దన్ను పుత్రునకె దక్కును గౌరవమీ వసుంధరన్!

**కటకం సూర్యనారాయణ మూర్తి, బెంగుళూరు**

వల్లెయె మన్మడన్న మరి వంశము నిల్పెడి వాడె గా
వానినల్లరి చేష్టలన్ తగిన హద్దుల నుంచరు నాయనమ్మలా
పిల్లడు రాలుగాయగను పెంకెగ దూరిన, నీసడించినన్
తల్లిని, దన్ను పుత్రులకె దక్కును గౌరవమీ వసుంధరన్

**కవుతా రామకృష్ణ**

తల్లిని మించు దైవమును తథ్యము గాంచము ధాత్రి నెచ్చటన్
చెల్లును భక్తి గల్గి తగు సేవలు చేయగఁ దల్లికెప్పుడున్
జెల్లియొ పుత్రియో సుతుడొ చెట్టతనంబున నిందసేయగాన్
దల్లిని, దన్ను పుత్రునికె దక్కును గౌరవ మీవసుంధరన్

**కొరుప్రోలు రాధాకృష్ణ రావు, మీర్ పేట్**

పల్లెయె పట్టుఁగొమ్మనయిఁ బాడియు పంటల కాలవాలమై
మెల్లనిఁ జూపులందుచును మిన్నగఁ మాతయెఁ బ్రోచుచుండగా
యెల్లలు లేని దాహమున నిమ్ముగ నమ్ముచు సొమ్ముకోసమై
తల్లినిఁ దన్ను పుత్రులకె దక్కును గౌరవ మీవసుంధరన్.

**గుండా వేంకట సుబ్బ సహదేవుడు, ప్రొద్దుటూరు**

తల్లడ పెట్టి సాధువుల దారుణ మారణకాండలందు భీ
తిల్లఁగఁ జేయు రాక్షసులఁ ద్రెంచెను దుర్గయె లోక రక్షణన్
జెల్లని ధూర్తులున్ బ్రజలఁ జింతల పాలొనరింప మ్రొక్కి యా
తల్లినిఁ, దన్ను పుత్రులకె దక్కును గౌరవ మీ వసుంధరన్

**జి.లింగేశ్వర శర్మ, సిద్దిపేట**

ఉల్లమునందుపేరిమియునొప్పుచునుండగనెల్లవేళల
న్నుల్లుకపోవగాపుడమినందున మిన్నగ జూచుచుండుచు
న్నెల్లరు గౌరవించి మదినిండుగ పూజలొనర్చుచుండినా
తల్లిని; దన్ను పుత్రులకెదక్కునగౌరవమీవసుందరన్

**పంతుల తపస్వి, విజయవాడ**

చిల్లులుపడ్డ వస్త్రమున చింతలనున్నను బిడ్డకున్ సదా
ఎల్లలులేని సంతసము నిచ్చెడు బంధువు మాతయే గదా
కల్లయెయౌను చూడగను కావ్యములందున నిట్టి వాక్యమున్
తల్లిని దన్ను పుత్రులకె దక్కును గౌరవ మీ వసుంధరన్

**పెనుకొండ రామబ్రహ్మం, బెంగుళూరు**

ఎల్లలు లేని ప్రీతిఁగని యెంతయొ పేర్మినిఁ బెంచు చుండినన్
దెల్లముఁ జేసి బాధ్యతలు దీటుగ నేర్పఁగఁ దండ్రి స్ఫూర్తితోఁ
జల్లఁగ తెల్పగన్ వలయు సంతుకు, శ్రద్ధగ చూడ సర్వదా
తల్లినిఁ దన్ను, పుత్రులకె దక్కును గౌరవమీ వసుంధరన్

**మంకు శ్రీను, కొప్పర్రు, ప.గో. జిల్లా**

అల్లన వైనతేయుడు మహాశుగ రీతి చరించి వే సుధన్
చల్లగ దెచ్చి తల్లిచెర చయ్యన బాపె నవారితంబుగన్
తల్లికినేమి కావలయు తత్సుతులుండిన తాళవృక్ష మ
త్తల్లిని దన్ను పుత్రులకె దక్కును గౌరవ మీ వసుంధరన్

**మాడుగుల మురళీధరశర్మ, కాళేశ్వరం/సిద్ధిపేట**

కల్లలుపల్కుచున్సతము కామ్యకుబుద్ధితనీచభ్రష్టులై!
కొల్లలుమాటలాడుచును కుత్సితులైవెలుగొందుమూర్ఖులై!
ఎల్లలులేనివాక్కులిడి యెప్పటికప్పుడుసొమ్ముకోసమై!
తల్లినిఁదన్నుపుత్రులకె దక్కునుగౌరవమీవసుంధరన్!

**రాకుమార, గోదావరిఖని**

కల్లలెఱుంగనట్టి నిజగాథలధర్మపు నుగ్గుబెట్టుచున్
ఉల్లముచెంగలింప నొడినుయ్యెలజోలను ముక్తిజూపుచున్
మల్లియసోయగమ్మును హిమాంశువుచల్లదనమ్మునిచ్చు నా
తల్లినిదన్నుపుత్రులకెదక్కు నగౌరవ మీ వసుంధరన్.

**రాజేశ్వర శర్మ మల్యాచి**

చెల్లని దంచు, తక్కువని, జీవము లేనిది గాను దల్చి భా
సిల్లగ జేయు పద్ధతుల జిందరవందరగాను జేసి కో
కొల్లలుగా, వధానముగ, గోరుచు నాంగ్లము వాడి తెల్గు మా
తల్లిని దన్ను పుత్రులకె దక్కును గౌరవ మీ వసుంధరన్.

**విద్వాన్ భైరపనేని పోతురాజు చౌదరి**

ఉల్లము పొంగు గర్భమునున్నది బాలుడనంగ మోదమై
యల్లరియంచు నెంచునటు భావన వత్సుని చేతలన్నియున్
చల్లని కాన్పుగల్గుతరి చర్యలు నెక్కుడై జన్మనొందగా
తల్లిని దన్ను పుత్రులకె దక్కును గౌరవమీ వసుంధరన్.

**వేగరాజు సాయి వర ప్రసాద్, హైదరాబాదు**

పిల్లలు జన్మదాతయని ప్రీతిగఁ గొల్చెద రెవ్వరిన్? ఖరం
బెల్లపుడేమి చేయును సహించని స్పర్శను పొంది, కాళ్ళతో?

వల్లెగ కర్మకాండ తొలి బాధ్యత యెవ్వరిదో? క్రమంబుగా
తల్లిని, దన్ను, పుత్రులకె దక్కును గౌరవ మీ వసుంధరన్.

**డా. శాస్త్రుల రఘుపతి, హైదరాబాద్**

కల్లలు చెప్పుచున్ పడుపు కాంతల తోడ చరించు తండ్రి నా
ఇల్లును పిల్లలన్ గనని హీనుని మార్చ నసాధ్య మైనచో
మెల్లిగ వెళ్లి కన్గొని రమింపగ నెంచెడు నట్టి వేశ్యకున్
తల్లిని దన్ను పుత్రులకె దక్కును గౌరవ మీ వసుంధరన్

## దత్తపది

**'పాలు - పెరుగు - వెన్న - నేయి' పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ ఒక నీతిని బోధిస్తూ స్వేచ్ఛాఛందంలో**

**అన్నపరెడ్డి సత్యనారాయణ రెడ్డి, హైదరాబాదు**

ఉ. వైరుల పాలు చేయక శుభమ్మగు దేశ రహస్యముల్ సదా
భారత మాతనే యిరుకు పాలనొనర్చునకార్య శీలులే
యూరక నీచులై పెరుగు చున్నను వారల మృత్యువెన్నగా
పౌరులె యేకమై నయపు బాటనెఱింగి వసింప మేలగున్.

**ఆరవల్లి శ్రీదేవి, హైదరాబాదు**

తే.గీ. సరిగ పాలు పంచుకొనుచు సల్ది మూట
పెరుగు వన్నె చిన్నెలహరి ప్రీతి గొల్పె
తరలి తా వెన్నంటియె బోవ తరుణి బట్ట
వింత గాథలనే యిల వేద్క వింటి!

**కటకం సూర్యనారాయణ మూర్తి, బెంగుళూరు**

ఉ. ఆ మురిపాలు ముచ్చటలు నల్లరి చేష్టలు ముద్దు గాని నీ
వేమరియున్నచో పెరుగు నెంతయు పెంకెతనంబు మిత్రమా
నీమపు రీతులన్ గరపు నీతులవెన్నగ మేలొనర్చు సం
క్షేమమునే యిడున్ దగిన శిక్షకు శిష్యరికంబు వానికిన్

**కవుతా రామకృష్ణ**

తే.గీ. పెరుగునే గాడిద యశము పిల్లి పొగడఁ?
దిరుగునే యిభరాజము మొరగ కుక్క?
పరుల యుక్తికుయుక్తుల పాలు గాక
మూలహేతువెన్నఁ గలుగు బాల! మేలు

**గుండా వేంకట సుబ్బ సహదేవుడు, ప్రొద్దుటూరు**

ఆ.వె. తినఁగఁ దిండి నీవు దిబ్బపాలు నరుడా!
పెంపెరుగు పరులకు పెట్టినంత
పుణ్య కర్మలెంచఁ బొల్లు పోవెన్నడున్
హితమునే యిడునిల సతము నీకు

**జి.లింగేశ్వర శర్మ, సిద్దిపేట**

తే.గీ. వెన్న దొంగనికృపచేతమిన్నగాను
పాలు పంచుకొనుచుమంచిపనులలోన
సాగుచుండిన పెరుగు చుసంతరించు
శాశ్వతముగ నేయి లలోనసద్యశమ్ము

పంతుల తపస్వి, విజయవాడ

ఆ.వె. కూడదుధరలోనకోపాలుతాపాలు
అవియులేనినాడు హాయి పెరుగు
భావియందునీకురావెన్నడిడుములు
ఫలమునేయిడుభగవంతుడెపుడు

**పెనుకొండ రామబ్రహ్మం బెంగుళూరు**

చం. వరలనహమ్ము కష్టముల పాలు పడంగ జనాళి తథ్యమౌ
పెరుఁగును స్వార్థమే విరిసి ప్రేమనుఁ గాంచుట మృగ్యమై చనున్
గరువము వెన్నడించఁదగు గౌరవమొందఁగఁ జాలమంచు నీ
వెరుగుచుఁ గాంచ విస్తరమునే యిల నొందెదవయ్య సౌఖ్యమే!

**రాకుమార, గోదావరిఖని**

తే.గీ. కోపతాపాలుజనియించు కుత్సితులకు
పెరుగుటవిరుగుటతనంబు నెరుకపరుచు
పరమపూజ్యులవెన్నంటు చరితగరిమ
అహితులకొనగూరతగునే యిహముపరము.

మంకు శ్రీను, కొప్పర్రు, ప.గో. జిల్లా

తే.గీ. పాలతో బాటుగా మురిపాలొసంగ
పెరుగునాత్మశక్తియును వివేక గుణము
కన్న! నీవెన్నడేనియు కన్నవారి
వీడవలదు కన్నేయి ఆ వృద్ధులయెడ

విద్వాన్ బైరపనేని పోతురాజు చౌదరి

ఆ.వె. ఏమి పాలుగోరి యెలుగెత్తి పాడును
పికము, పెరుగు ముదము వినగ పాట
మేఘగర్జనలకు మేనితావెన్నదే
నెమలినేయిలగని నిండు మనసు.

**వేగరాజు సాయి వర ప్రసాద్, హైదరాబాదు**

కం. శిశుపాలు వధకు హేతువు
వశమునలేని పెరుగుదల వదరుఁదనమునన్,
దశనే యిహమున మార్చును
భృశముగ వెన్నడి దురితము విధిదృష్టముగన్.

డా. శాస్త్రుల రఘుపతి, హైదరాబాద్

తే.గీ. పదవి రాగానె అవినీతి 'పాలు' వోక
వృథలు 'పెరుగు'ట భరియించి బ్రతుకు జనుల
పేద వారిని 'వెన్నంటి' సేద దీర్చ
దలచు వారల వలన'నే యి'లకు మేలు.

సమస్య: పురుషుఁడు గర్భధారణముఁ బుణ్యవశంబునఁ బొందెఁ బ్రీతితోన్

దత్తపది: 'మట్టి - మన్ను - నేల - పుడమి' పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ, కౌరవసభలో శ్రీకృష్ణుని మాటలు - స్వేచ్ఛాఛందంలో

(పూరణలు 15 ఫిబ్రవరి 2026 లోపు **7702121376** నంబరుకు పంపాలి)

# పద్యకవిత్వము సాధుప్రయోగాలు - 5

- 'అష్టావధాని' చిటితోటి విజయకుమార్




## స్త్రీప్రత్యయ దోషాలు - 2

నకారాంత, ఋకారాంత శబ్దాలకు స్త్రీవాచకంలో జీప్ వచ్చి పదం చివర ఈకారం ఉంటుంది. ఉదాహరణకు

నకారాంత శబ్దాలు - రాజన్ > రాజ్ఞీ, కోపిన్ > కోపినీ, కామిన్ > కామినీ, చక్రవర్తిన్ > చక్రవర్తినీ, తపస్విన్ > తపస్వినీ, త్యాగిన్ > త్యాగినీ, దేహిన్ > దేహినీ, వాగ్మిన్ > వాగ్మినీ, శిల్పిన్ > శిల్పినీ, ప్రియవాదిన్ > ప్రియవాదినీ మొదలైనవి. అయితే మకారం ఉపధలో ఉన్న నకారాంత శబ్దాలకు జీప్ రాదు. దామన్ > దామా అవుతుంది కానీ దామీ కాదు. (దామన్అంటే త్రాడు. ఇది సంస్కృతంలో స్త్రీవాచకం). ఇట్లే సీమన్ > సీమా (హద్దు).

ఋకారాంత శబ్దాలు - కర్తృ - కర్త్రీ, హర్తృ - హర్త్రీ, అభినేతృ - అభినేత్రీ

ప్రత్యయం లోని కకారానికి పూర్వం ఇకారం వస్తుంది (అ.7.3.44). ఉదాహరణకు అధ్యాపకి అనకూడదు. అధ్యాపిక అనాలి. ఇట్లే లేఖకి అనకూడదు. లేఖిక అనాలి, సేవకి అనకూడదు. సేవిక అనాలి. నాయకి అనకూడదు నాయిక అనాలి. ఉపన్యాసకీ అనకూడదు, ఉపన్యాసిక అనాలి.

కొన్ని పదాలను గమనించండి.

చివర్లో ఈ లేదా ఆ వచ్చే పదాలు

విదుషి అనే అర్థంలో ప్రాజ్ఞీ లేదా ప్రాజ్ఞా అనవచ్చు.

చివర్లో ఆ వచ్చే పదాలు

మంచి పనులు చేసిన స్త్రీని సుకృతా అనాలి కానీ సుకృతీ అనకూడదు.

ఆధ్యక్ష్యం వహించే స్త్రీని అధ్యక్షిణి అనకూడదు. అధ్యక్షా అనాలి.

సుమంగళి అనకూడదు. వేదం లోనే ఈ రూపం ఉంది. లౌకిక భాషలో సుమంగళా అనాలి.

ఛాత్రి అనకూడదు. ఛాత్ర అనాలి (జీప్ ప్రత్యయం అణ్ ప్రత్యయం మీద వస్తుంది కాని ణ ప్రత్యయం మీద రాదు)

భయంకరీ అనకూడదు. భయంకర అనాలి. (భయ పూర్వక కృ ధాతువుపై ఖచ్ ప్రత్యయం వచ్చినప్పుడు జీప్, జీష్ లు రావు. అష్టా 3.2.43)

సహోదరీ అనకూడదు. సహోదర అనాలి (వాసుదేవసహోదరా అనాలి కానీ వాసుదేవసహోదరీ అనకూడదు).

ఈశ్వరుని భార్య ఈశ్వరి. ఐశ్వర్యం ఇచ్చే దేవత ఈశ్వరా.

చివర్లో ఈ వచ్చే పదాలు

నర్తకి (నర్తన కౌశల్యం ఉన్న స్త్రీ. నాట్యకౌశల్యం లేకుంటే నర్తిక అనాలి)

మెరుపును సౌదామని అనాలి, సౌదామిని అనకూడదు ప్రయోగాలు ఉన్నా సరే.

(ఘ) స్త్రీవాచకం లేని పదాలు

సుహృత్ (స్నేహితుడు), ముని, గురు మొదలైనవి నిత్య పుంలింగ పదాలు. వీటికి స్త్రీవాచకాలు ఉండవు. ఆమె గొప్ప ముని, ఆమె గురువు, ఆమె సుహృత్తు ఇలాగే అనాలి. ఇలాంటివే ఋషి, శాస్త్రి, కవి మొదలైన పదాలు. వ్యక్తి అనేది స్త్రీవాచకం అయినా పురుషులను కూడా వ్యక్తి అంటారు. (సంతః సదసత్ వ్యక్తిహేతవః అని రఘువంశంలో కాళిదాసు).

గమనిక - ఆకారాంత స్త్రీవాచక శబ్దాలను తెలుగులో అకారాంతాలుగా, ఈకారాంత స్త్రీవాచక శబ్దాలను తెలుగులో ఇకారాంతాలుగా ప్రయోగిస్తాము. పద్మనేత్రాను పద్మనేత్ర అనీ, చక్రవర్తినీని చక్రవర్తిని అని అంటాము. (నామంబుల తుది దీర్ఘంబు నకు హ్రస్వంబగు. బా. వ్యా. తత్సమ 54).

**(సశేషం)**

నవంబరు సంచికలో ప్రచురింపబడిన వ్యాసంలోని పొరపాటును సూచించిన పేరి రవికుమార్ గారికి ధన్యవాదాలు

## తటిల్లతలు

'అష్టావధాని' గాడేపల్లి కుక్కుటేశ్వర రావు అవధానముల నుండి...

**ప్రశ్న :** గుఱ్ఱము + అశ్వము = ఏమౌతుంది ?

**సమా :** ఆ రెండు భిన్న లింగాలైతే ఓపిల్ల పుడుతుంది.

**ప్రశ్న :** అవధాని గారూ! ఎవరైనా పేరు పెట్టుకుంటే ఏ రాముడనో, కృష్ణుడనో పెట్టుకుంటారు. మీ పేరేమిటండీ కుక్కుటం అనే పదంతో ప్రారంభం అవుతుంది! కుక్కుటం అంటే కోడి కదా! అల్లాటి పేరు పెట్టుకున్నారేం?

**సమా :** ఈ పేరు నేను పెట్టుకోలేదు. మా తండ్రిగారు పెట్టారు. ఆయన స్వర్గంలో ఉన్నారు. నిజంగా సందేహం తీర్చుకోవాలంటే - నా కభ్యంతరం లేదు.

# తెలుగు ఛందోలాక్షణిక గ్రంథములు

- డా.టేకుమళ్ళ వెంకటప్పయ్య

వేదాంగాలను "శిక్షా వ్యాకరణం ఛందో నిరుక్తం జ్యోతిషం తథా/ కల్పశ్చేతి షడంగాని వేదస్యాహుర్మనీషిణ్ణ" అంటారు. వేదాంగాలు అంటే వేదాలను సరిగ్గా అర్థం చేసుకోవడానికి, ఉచ్ఛరించడానికి, వాటిలోని కర్మలను నిర్వహించడానికి సహాయపడే ఆరు అనుబంధ శాస్త్రాలు. అవి శిక్ష (ధ్వనిశాస్త్రం), వ్యాకరణం (వ్యాకరణం), ఛందస్సు (ఛందస్సు), నిరుక్తం (పద వ్యుత్పత్తి), కల్పం (ఆచార కర్మలు), మరియు జ్యోతిషం (ఖగోళశాస్త్రం). వేదాంగములారింటిలో ఛందస్సు ఒకటి. "ఛన్దఃపాదౌతు వేదస్య" అని ఆర్యోక్తి. ఛందస్సు అనేది వేదమూర్తికి పాదస్థానంగా చెప్పబడినది. వ్యాకరణము వలె ఛందస్సునకు కూడా పరమేశ్వరుడే మూలమని సాహిత్యరత్నాకరం చెప్తున్నది. ఛందశ్శాస్త్రము గురుపరంపరగా మొదట పరమశివుని నుండి నందికేశ్వరుడు, అతనినుండి సనత్కుమారుడు, అతని నుండి అగస్త్యుడు, అతని నుండి బఅహస్పతి, అతని నుండి ఇంద్రుడు, అతని నుండి ఆదిశేషుడు, అతని నుండి అతని తమ్ముడైన పింగళకుడు పొందినారు. పింగళకుని శిష్యుల ద్వారా లోకంలో వ్యాప్తి చెందినది. భరతుని నాట్య శాస్త్రమందు ఛందశ్శాస్త్ర ప్రసక్తి ఉన్నా గురు పరంపర వేరే విధముగానున్నప్పటికీ చివరి వాడు పింగళకుడే కావడం విశేషం. పింగళకుడు ప్రతిపాదించిన సూత్రములనే, సంప్రదాయములనే తర్వాతివారు అనుసరించారు. దేశీయ ఛందస్సు విషయములో కొన్ని కొన్ని క్రొత్త అంశాలు ప్రతిపాదింపబడినప్పటికీ, మార్గము మాత్రము పింగళకునిదే అని శాస్త్ర సమ్మతము.

భారతదేశమందు తొలి ఛందో లక్షణగ్రంథం సంస్కృతములో రూపొందినది. సంస్కృతమున తొలి లాక్షణికుడు పింగళకుడు. భరతుని నాట్యశాస్త్రములో కొంత ఛందో విషయ ప్రస్తావనలు ఉన్నప్పటికీ, అగ్నిపురాణ కర్త కూడా ఛందో విషయములను ప్రస్తావన చేసియున్నాడు. సంస్కృతమున ప్రసిద్ధులైన ఛందో లాక్షణికులు 'ఛందోనుశాసన" కర్త హేమచంద్రుడు, జయదేవుడు, జనాశ్రయుడు, 'వఅత్తరత్నాకర ' కర్త కేదారభట్టు, ఛందోమంజరీ కర్త గంగాదాసు మొదలైనవారు. ఇప్పటి వరకూ లభించిన సమాచారం మేరకు తెలుగులో తొలి ఛందోలాక్షణికుడు కవిజనాశ్రయ కర్త. ఈ గ్రంథ కర్తృత్వం విషయంలో భిన్నభిప్రాయాలున్నాయి. ఆధునిక కాలము వరకూ దీని కర్త వేములవాడ భీమన యని లోకంలో ప్రతీతి కాగా, ఆధునికులు కొందరు రేచన అని చెప్పుచున్నారు. వాదములు ప్రక్కనబెట్టి ప్రమాణాల ఆధారంగా చూస్తే భీమనయే దీని కర్తయని చెప్పవచ్చును. తమిళములో 'వాంచియ' అనే ఛందోలాక్షణికుని గురించి 'యాప్పిరుంగలక్కారికై' అనే తమిళ ఛందోగ్రంథము (11వ శతాబ్ది) లో చెప్పబడినది కానీ సదరు వాంచియ ఎవరో తెలియరాలేదు. పాల్కురికి పండితారాధ్యచరిత్రలో ప్రాచీన తెలుగు ఛందోగ్రంథము నుండి 'అనియత గణ్ణె – ప్రాసోవా యతిర్వా' అనే సూత్రాలనుదాహరించాడు కానీ ఆ సూత్రములున్న లక్షణ గ్రంథాలు నేడు ఎక్కడా లభించడంలేదు. ఈ కవిజనాశ్రయము 11వ శతాబ్ది మధ్య కాలంలో రచింపబడ్డట్టు చెప్తున్నారు. నాటి నుండి నేటి వరకూ ఎన్నో ఛందోగ్రంథాలు మనకు తెలుగులో లభ్యమౌతున్నాయి. కొన్ని సంకలన గ్రంథాలు కాగా కొన్నింటికి కర్తృత్వము తెలియనివి. ఇట్టి గ్రంథాలు సుమారు 65 వరకూ ఉన్నాయని రావూరి దొరస్వామిగారు తన 'తెలుగుభాషలో ఛందోరీతులు' గ్రంథములో తెలిపారు. తెలుగులో ప్రసిద్ధమైనవి, ప్రచారంలో ఉన్నవి అయిన 14 ఛందోగ్రంథాల గురించి చూద్దాం.

**1. కవి జనాశ్రయము:** లభిస్తున్న ఆధారాలను బట్టి తొలి తెలుగు లక్షణ గ్రంథం కవి జనాశ్రయము. ప్రమాణాలను అనుసరించి దీని కర్త వేములవాడ భీమనగా భావించదగును. ఈతడు తెలంగాణాలోని కరీంనగర్ మండలంలోని వేములవాడ నివాసి. కాలము 12వ శతాబ్ది యారంభ కాలము. ఈ గ్రంథంలో ఐదు అధికారములున్నవి. మొదటిది సంజ్ఞాధికారాము. ఈ అధ్యాయంలో ఛంద్ణప్రశంస, గురులఘు వివేకము, గణస్వరూపము, గణదేవతాధికము, యతిబేధాలు, ప్రాసబేధాలు, షడ్విధ ప్రాసలు ఉన్నాయి. రెండవ అధ్యాయమైన వఅత్తాధికారములో 26 ఛందముల వివరణ, అర్ధసమ, ఉద్ధురమాలా వఅత్తాల వివరణలు ఉన్నవి. మూడవదైన జాత్యాధికారములో ఆర్యగీతులు, జాత్యుపజాతులు ఉన్నాయి. నాల్గవ షట్ప్రత్యయాధికారములో ప్రస్తారాది షట్ ప్రత్యయాలు చెప్పబడినవి. ఐదవదైన దోషాధికారములో దశవిధ కావ్య దోషములు, కొన్ని వ్యాకరణ సంబంధ దోషములున్నవి.

**2. కావ్యాలంకార చూడామణి:** దీని కర్త విన్నకోట పెద్దన. ఈతడు 15వ శతాబ్ది పూర్వార్ధంలో చాళుక్య విశ్వేశ్వర భూపతి కాలంలో నివసించి, ఈ గ్రంథాన్ని అతనికే అంకితమిచ్చాడు. దీనినే పెద్దిరాజు అలంకారము అని కొందరు తమ గ్రంథాల్లో

చెప్పారు. ప్రధానంగా ఇది అలంకారశాస్త్ర గ్రంథము. అయితే ఇందలి తొమ్మిది ఉల్లాసములలో 7,8 ఉల్లాసములలో మాత్రమే ఛందస్సు గూర్చి చెబుతూ సప్తమోల్లాసములో యతి-ప్రాస బేధాలు, కొన్ని వఅత్తములు చెప్పి, అష్టమోల్లాసములో కొన్ని వఅత్తములు, అర్థసమ-విషమ వఅత్తాలు, ఉద్దుర మాలా వఅత్తాలు, షట్ప్రత్యయాంశాలు చెప్పి చివరి ఉల్లసమున సంధి, సమాస, తద్ధితాదుల గురించి వివరించాడు.

**3. ఛందో దర్పణమూ 1:** దీని కర్త అనంతుడు. ఈయన 15 వ శతాబ్ది పూర్వార్ధము వాడు. ఈయన యితర రచనలు భోజరాజీయము, రసాభరణము. ప్రసిద్ధి చెందిన ఆవూపులి కథ ఈతని భోజరాజీయములోనిదే. ఈ గ్రంథములోగల నాలుగు ఆశ్వాసములలో మొదటి దానిలో పద్యగద్యాది కావ్య విభాగము, గురు లఘు నిర్ణయము, యతిప్రాస బేధాలు, రెండవ దానిలో కొన్ని వఅత్తములు, అర్ధసమావిషమ వఅత్తాలు, ఉద్దుర మాలా వఅత్తాలు, మూడవ దానిలో ఆర్యాగీత్యాదులు, జాత్యుపజాతులు, చాటు ప్రబంధ విశేషాలు, ఉదాహరణ కావ్య లక్షణాలు, షట్ప్రత్యయాంశాలు, నాల్గవ దానిలో దశవిధ దోషాలు, సంస్కృత సంధులు, సమాసాలు, కారకాలు మొదలైన వ్యాకరణాంశములున్నవి. ముఖ్యమైన విశేషమేమనగా ఈతడు సూర్య గణముల విషయములో యితరులతో విబేధించినాడు. తదనంతరము ఈతనినే కవులు అనుసరించారు. అంతే కాదు సీస పద్యముల విషయములో అనంతుని లక్ష్య లక్షణ కృషి నిజంగా అనంతమే!

**4. కవి చింతామణి :** దీని కర్త వెల్లంకి తాతంభట్టు. ఈయన కూడా 15వ శతాబ్ది వాడే! ఈ కవి చింతామణి ఛందో గ్రంథము. ఈ గ్రంథములో భాషా నిర్ణయము, వర్ణ నిర్ణయము, యతిప్రాస బేధాలు, దోషాధికారమనునవి ఉన్నవి. ఛందో విషయములు కూడా యతిప్రాసలకు సంబంధించినవే. పలు ఛందో లాక్షణికులు ఈ గ్రంధాన్ని ఉదాహరించి యున్నారు.

**5. ఛందో దర్పణము 2:** దీని కర్తయును వెల్లంకి తాతంభట్లు. ఇది అనంతుని గ్రంథము కంటే విలక్షణమైనది. తాతంభట్లు దర్పణము అనే పేరుతో రచించడం వల్ల, అనంతుడు వ్రాసిన గ్రంథానికి, అనంతుని ఛందమను పేరు స్థిరపడింది అప్పకవి కూడా 'అనంతుని ఛందంబు, తాతంభట్లు ఛందో దర్పణము' యని పేర్కొన్నాడు. ఇందు ఎన్నో ఛందో విషయములు ప్రస్తావించినట్లు ఉదాహరణలున్నప్పటికీ ఈ గ్రంథము అలభ్యమవడం దురదఅష్టము.

**6. లక్షణ సార సంగ్రహము 1:** ఈ గ్రంథము చిత్రకవి పెద్దన కృతము. ఇందులో గొప్ప చిత్రకళా విశేషములున్నవి. ఇది మూడాశ్వాసములు గల గ్రంథము. ప్రథమాశ్వాసములో అక్షరలక్షణము, గురులఘు నిర్ణయము, గణ నిర్ణయము, అక్షర దేవాధికము, యతిప్రాసలు కాగా, రెండవ అధ్యాయములో అర్ధ సమావిషమ వఅత్తాలు, షట్ప్రత్యయాంశాలు, ఉద్దురమాలా వఅత్తాలు, జాత్యుపజాతులు, వైతాళీయ బేధాలు, యక్షగాణ లక్షణములు, మూడవ అధ్యాయములో రేఫాఱ కార నిర్ణయము, నాటక లక్షణాలు, చిత్ర, బంధ, గర్భ కవితా స్వరూపాలు విపులముగా చెప్పబడ్డాయి. అప్పకవీయ రచనకు యిదియే మూలగ్రంథమని పలువురు లాక్షణికుల అభిప్రాయము.

**7. సులక్షణ సారము:** దీని కర్త లింగమగుంట తిమ్మకవి. ఈతడు తెనాలి రామకృష్ణకవికి అల్లుడు. 16వ శతాది ఉ త్తరభాగములో జీవించినవాడు. ఈ గ్రంథములో ఎనిమిది ప్రకరణాలున్నాయి. అవి సంజ, షట్ప్రత్యయ, జాత్యుపజాతి, వఅత్త, యతి, ప్రాస, అక్షరగుణదోష, గణవిషయవిచారక అనేవి. వ్యాకరణాంశములేమీ లేకుండా కేవలం ఛందో లక్షణములతో రాసిన గ్రంథం. ఇందులో పలు ఛందో గ్రంథములుదాహరింపబడ్డాయి. ఛందో విద్యార్థులకు పాఠ్యగ్రంథంగా బహుళ ప్రచారంలో నున్న గ్రంథము.

**8. కవి సంజీవని:** దీని కర్త ముద్దరాజు రామన. 16-17 శతాబ్దాల కాలంలో జీవించిన కవి. ఈయానకు రామభద్రుడు అన్నపేరు కూడా ఉన్నది. ఈ గ్రంథంలో ప్రధానంగా వ్యాకరణాంశాలను చెప్పి, ఛందో విశేషాలను అప్రధానముగా గ్రహించినట్లు తెలుస్తుంది.

## తటిల్లతలు

'అష్టావధాని' గాడేపల్లి కుక్కుటేశ్వర రావు అవధానముల నుండి...

**ప్రశ్న :** శ్రీ ఎన్.టి.రామారావుకు, శ్రీ అక్కినేని నాగేశ్వరరావుకు ఉన్న తేడా పద్యంలో చెప్పాలి.

**సమా :** ఎంటీ రామారావున్
జంటిల్‌మన్; అట్లె నటుడు నాగేశ్వరుడున్
జంటిల్‌మన్నే కద! ఈ
తంటా లిట్లేల! తారతమ్యములేలా!

**ప్రశ్న :** ఆడవారి నోట్లో నువ్వుగింజ నానదంటారు. నిజమేనా!

**సమా:** మీయింట్లో ఎవ్వరూ ఆడవారు లేనట్లు ఈ ప్రశ్న నాదాకా రావాలా?ఒక్క గింజ నోట్లో వేసి చూస్తే అప్పుడే తేలిపోయేది కదా!

# వ్యాకరణ వరివస్య

ఎన్.సిహెచ్. చక్రవర్తి

తెలుగులో కొన్ని పదాలు ద్రుతప్రకృతికాలు అనబడతాయి. ఏమిటి ఈ ద్రుతప్రకృతికాలు?? తెలుసుకుందాం.

తెలుగులో లినలి కారాన్ని ద్రుతం అంటారు. ఈ విషయంలో కొంత చర్చ ఉంది. కేవలం న్ స్పర్శ అనేది ఉంటే అది ద్రుతమా?అని. నన్నయ "ద్రుతాఖ్యో న" అని చింతామణిలో చెప్పడం వల్ల కేవల "న" కారం ద్రుతం అనుకోవాలి. దానిని అనుసరించి చిన్నయసూరి నకారంబు ద్రుతము అన్నారు. కానీ ఆయన చూపిన ఉదాహరణలు అన్నిటిలో ఉత్వవిశిష్టమైన నకారం అంటే ను మాత్రమే ద్రుతంగా తెలుస్తున్నది.

దీనిని గమనించిన ప్రౌఢవ్యాకర్త "నకారంబసాధారణంబు ద్రుతంబు" అని సూత్రీకరించాడు. అంతేకాక అది ఉత్వవిశిష్టమై ఉండాలనీ ఆ "ను" ప్రత్యయ, ఆగమ, అవ్యయాత్మకంగా ఉండాలని స్పష్టత ఇచ్చాడు. అంటే స్వతఃసిద్ధంగా శబ్దగతంగా ను ఉంటే అది ద్రుతం కాదు.

**ఉదాహరణ:** చేను, పేను మొదలైన పదాలలో ఉన్న ను ద్రుతం కాదు.

ద్రుతం అంతమందు కల పదాలను ద్రుతప్రకృతికాలు అంటారు.ని ఏ ఏ పదాలు ద్రుతప్రకృతికాలు అవుతాయో చిన్నయసూరి సంజ్ఞాపరిచ్ఛేదంలో(12) వివరించాడు.

♦ విభక్తులలో ప్రథమ, కయి,పట్టి, యొక్క కాక మిగిలిన విభక్తి ప్రత్యయాలు అన్నీ ద్రుతప్రకృతికాలు.

♦ వత్తున్, వచ్చెదన్ వంటి ఉత్తమ పురుష ఏక వచనాలు ద్రుతప్రకృతికాలు.

♦ భూత తద్ధర్మార్థ ఆది ప్రథమైక పురుష ఏకవచనాలు అయిన వచ్చెన్, వచ్చున్ మొదలైనవి.

♦ కొట్టుచున్, కొట్టన్, కొట్టగన్, కొట్టుడున్, కొట్టినన్ వంటి పదాలు అన్నీ ద్రుతప్రకృతికాలు.

♦ నేను, తాను, వలె(న్), పోలె(న్), ఎంతయున్, పోలెన్, అయ్యున్ ఇలాటి పదాలు అన్నీ ద్రుతప్రకృతికాలు.

అని చిన్నయసూరి వివరించారు.

ఇక్కడ ఒక విషయం: ఈ పట్టికలో సూరి గారు తాను, నేను పదాలను కూడా ద్రుతప్రకృతికాలుగా ప్రత్యేకంగా పేర్కొన్నాడు. వీటిలో ఉన్న ను శబ్దగతములని కొందరు, ప్రత్యయాత్మకాలు అని కొందరు చెప్తారు.

మరొక విషయం ఏమంటే...శబ్దగతంగా ఉన్న ను ద్రుతం కాదని చెప్పుకున్నాం. కానీ చిన్నయసూరి ఒక్క కన్ను శబ్దాన్ని మాత్రం ద్రుతప్రకృతికంగా స్వీకరించాడు.

సంధిపరిచ్ఛేదంలో 22వ సూత్రంలో కన్నులోని "ను"ను సూరి ద్రుతంగా పరిగణించడం చూడవచ్చు. అలాగే ఇతర సందర్భాలలో కూడా కన్నును ద్రుతప్రకృతికంగానే సూరిగారు భావించారు. అది పూర్వ ప్రయోగాలనుబట్టియే.

ఈ ద్రుతాలు, ద్రుతప్రకృతికాల గురించి అభ్యాసకులు కొంత శ్రద్ధగా తెలుసుకోవాలి..ఎందుకంటే మునుముందు సంధి విషయకంగా ఈ ద్రుతమూ ద్రుతప్రకృతికాల వల్ల సంధులలో కొన్నికొన్ని మార్పులు ఏర్పడతాయి. ఇవి కీలకమైనవి కూడా.

**(సశేషం)**

(6వ పేజీ తరువాయి)

## రసపోషణ

యన్నువ బ్రహ్మచారి ముఖ మంబురుహంబు సమంబు సూడఁగన్

(అరణ్య 3-107)

ఓ మునీశ్వరా ! ఆ పద్మము వంటి ముఖము కల్గిన సుందర బ్రహ్మచారి తన ముఖమును నా ముఖమునకు చేర్చి ఒక్క మృదు మనోహరమైన శబ్దము చేసినాడు. అటువంటి శబ్దము నేను పూర్వ మెప్పుడును వినియుండలేదు. ఇంతే ఈ పద్యము యొక్క వచనానువాదము. కానీ, తాత్పర్యభావాలు మిక్కిలి లోతైనవి. మన సంప్రదాయములో నే పనినైనను ముమ్మారు చేసినచో నది సంపూర్ణమైనట్లే. ఇక్కడ ఋష్యశృంగుడు మునికుమారునిగా భ్రమించిన ఆ విదగ్ధ వేశ్యాంగన తన యధరోష్ఠ్యముల నతని యధరోష్ఠ్యములతో చేర్చి చుంబనత్రయము ననుగ్రహించినది. ఈ విషయమును నన్నయ ధ్వనింపజేసినాడు. "అంబురుహంబు సమంబు" అను సమాసములో చుంబనమును స్ఫురింపజేయు "బిందుపూర్వక బు కారము" ను ముమ్మారు ప్రయోగించినాడు. పైగా మృదుమనోహర శబ్దమనినాడు. అందుతో కార్యము సంపూర్ణ మైనది. వేశ్యాంగన వైదగ్ధ్యము బోధపడినది. (ర)సహృదయ పాఠక హృదయమునకు చేరినది. ఇదీ ఆత్మనిగ్రహము గల సంస్కారి యైన కవి అమలిన శృంగారమును కావ్యకన్య మర్యాదకు భంగము కలుగకుండ నిర్వహించు విధానము.

# తేటగీతి గర్భ చంపకమాల ఎంత సులభమో కదా వ్రాయడం.

## గర్భకవిత్వము

- చింతా రామకృష్ణారావు

*గతసంచికలో గర్భకవిత్వం ఎంతసుకరమో తెలియజెప్పే ప్రయత్నం చేసాను. ఈ సంచికలో గర్భకవిత్వరచనను సప్రమాణికముగా తెలియజేసే ప్రయత్నం చేస్తాను.*

ఒకే వృత్తములో అనేక కందపద్యములు, గీత పద్యములు పొదిగించి వ్రాసే ప్రయత్నం చేద్దాము. ఉదాహరణకు చంపకమాల పద్యములో తేటగీతి, మరియు కందము వ్రాయుటను సాధన చేద్దాము.

చంపకమాలలో గణాలు గురులఘువులు విడదీసినచో

III - IUI - UII - IUI - IUI - IUI - UIU.

చంపకమాలలో ప్రతీ పాదంలో గణాలు ఈ విధంగానే వస్తాయి. ముందుగా ఈ పాదంలో తేటగీతి ఏ విధంగా వ్రాయుటకు అవకాశమున్నదో పరిశీలిద్దాం.

చంపకమాల పాదంలో మొదటి ఏడు అక్షరములను దాటించి చివరి గురువును మినహాయించి చూచినచో తుదివరకు తేటగీతి వచ్చు అవకాశము మనకు కనిపిస్తుంది. అనగా

(III - IUI - U) II - IUI - IUI - IUI - UI (U).

తేటగీతికి అనుకూలమైన ఒక సూర్యగణము తరువాత రెండు ఇంద్రగణములు ఆపై రెండు సూర్యగణములు వస్తున్నాయని మీరు పరిశీస్తే తెలుస్తుంది. ఆ గణములే న – భ – భ – హ – హ.

చంపకవృత్తములో వ్రాస్తున్నాం కావున తేటగీతి నాలుగు పాదములలోను అదే విధంగా వచ్చితీరాలి. అప్పుడే చంపకమునకు సరిపోవడంతో పాటు తేటగీతి పద్యము సలక్షణంగా పూర్తి చేయవచ్చును.

ఇక యతిని పాటించడం ఎలాగో పరిశీలిద్దాము.

చంపకములోని ఎనిమిదవ అక్షరమునుండి తేటగీతి పద్యము కావున ఆ ఎనిమిదవ అక్షరముతో పదిహేడవ అక్షరమునకు యతి వేస్తే తేటగీతికి యతి సరిపోతుంది. ఇందులో ప్రాసయతి వచ్చే అవకాశముండదు.

ఇదే పాదము చంపకమాల పాదము కావున చంపకమాలలోని మొదటి అక్షరముతో చంపకమాల పదకొండవ అక్షరమునకు యతి వచ్చునట్లు తేటగీతిలో కూడా చూడాలి.

ముందుగా చంపకవృత్తంలో వచ్చు తేటగీతిని ప్రయత్నిద్దాం

(I) II - IUI - UII - I (U) I - IUI - IUI - UIU.

ఇందులో కుండలీకరణములలో ఉన్న అక్షరములు చంపకమాల పాద యతిస్థానములు.

(III - IUI - U) (I) I - IUI - IUI - I (U) I - UI (U).

ఇవి తేటగీతి యతి స్థానములు.

'దత్తదేవరా!' అన్నది చంపకమాలలో మనం మకుటంగా స్వీకరిస్తే అందులో చివరి గురువును మినహాయించి చూస్తే 'దత్తదేవ!' అనే మకుటం తేటగీతిలో చివరి రెండు హగణాలు వస్తాయి. అదేవిధంగా ప్రతీ పాదంలో చివరి అక్షరముతో తేటగీతికి సంబంధము ఉండని విధముగా వ్రాయాలి.

ఉదా. (క)వన మార్గము నొప్పుచు (కై)తవ్రాయ

అనే తేటగీతి పాదం నిర్మించామనుకోండి. దీనిలో యతి సరిపోయే విధముగా కూర్చుట జరిగినది. దీనినే చంపకమాలలో ఇమిడ్చే ప్రయత్నం చేస్తే

(మ)ది కమనీయమౌ {కవన (మా)ర్గము నొప్పుచు కైతవ్రాయ}గా

ఇందు మీసాలకుండలీకరణంలో తేటగీతి పాదము ఉండగా అందలి నాలుగవ అక్షరం చంపకమాలలో పదకొండవ అక్షరం కావడంతో మొదటి అక్షరంతో యతి కుదురునట్లుగా వేయడం జరిగినది. ఇదే విధంగా నాలుగు పాదాలూ వ్రాయునప్పుడు చంపకములో ప్రాస సరిపెడుతూ, తేటగీతిలో యతులను సరిపెడుతూ పద్యం వ్రాస్తే తేటగీతి గర్భ చంపకమాల అను గర్భకవిత్వం వ్రాసినవారమవుతాము. మిగిలిన పాదాలను పూరించి చూద్దాము.

**తేటగీతి గర్భ చంపకమాల.**

(మ)ది కమనీయమౌ {కవన (మా)ర్గము నొప్పుచు కైతవ్రాయ} గా
(ప)ద కమలంబులే {వినుత (ప)ద్యము గా వికసించి తీరు}(గా)
యెద గమకంబుతో {కనుచు నెన్నుము వ్రాయుచు కావ్యమందు}నన్
(హృ)ది ప్రముదంబుతో {తనియు (దీ)వు మహీస్థలి, దత్తదేవ}రా!

**చంపక గర్భస్థ తేటగీతి**

(మ)ది కమనీయమౌ {కవన(మా)ర్గము నొప్పుచు కైతవ్రాయ}గా
(ప)దకమలంబులే {వినుత (ప)ద్యముగా వికసించి తీరు}గా
యెద గమకంబుతో {కనుచు నెన్నుము వ్రాయుచు కావ్యమందు}నన్
(హృ)ది ప్రముదంబుతో {తనియు(దీ)వు మహీస్థలి, దత్తదేవ}రా!

మీరు దీనిని గమనించి సర్వలక్షణ సమన్వితంగా ఉన్నదని గ్రహిస్తే మీరు కూడా ప్రయత్నం తప్పక చేయండి.

# కావ్యదోషాలు

డా॥ సూరం శ్రీనివాసులు

మరో దోషం అప్రతీతం. 'శాస్త్రమాత్ర ప్రయుక్తమ్ అప్రతీతమ్' అని వామన నిర్వచనం. లోకంలో మాత్రమే వాడుకలో వున్నది దోషమైనట్లే శాస్త్రాలలో మాత్రమే కనిపించే పదాన్ని సాహిత్యంలో వాడటం దోషమే.

ఉదా:

కిం భాషితేన బహునా రూపస్కంధస్య సన్తి మే న గుణాః ।
గుణనాంతరీయకం చ ప్రేమేతి న తేఽ స్త్యుపాలంభః ॥

ఇది వామనుడిచ్చిన ఉదాహరణ శ్లోకం. దీని అనువాదం –

పలు పలుకు లేల నేను చెప్పగను రూప
స్కంధమున గుణము లేమియుఁ గనుబడవిట
ప్రేమ యనినను గుణనాంతరీయకంబు
గద యిచట నిన్ను నేమనగలదు నాకు.




ఇక్కడ రూపస్కంధ, నాంతరీయక పదాలు శాస్త్ర గ్రంథాలలో మాత్రమే వాడబడేవి. వాటిని కావ్యంలో వినియోగించటం దోషం. రూపస్కంధమంటే శరీరం. ఇది బౌద్ధంలో కనిపించే పదం.

విజ్ఞాన వేదనా సంజ్ఞా సంస్కారో రూపమేవ చ ।
భిక్షూణాం శాక్యసింహేన స్కంధాః పంచ ప్రకీర్తితాః ॥

ఇది సౌగతమతం. బౌద్ధంలో ప్రసిద్ధమైన ఈ రూపస్కంధ పదాన్ని శరీరార్థంలో సాహిత్యంలో వాడటం దోషం. అలాగే నాంతరీయక పదం మీమాంసాశాస్త్ర ప్రసిద్ధం. 'లేని' అనే అర్థంలో ఆ శాస్త్రంలో ఆ పదాన్ని వాడుతారు. దాన్ని సాహిత్యంలో వినియోగించటం దోషం. ఇక్కడ ఉదాహరింపబడిన ఈ రెండు పదాలు – రూపస్కంధ, నాంతరీయక – అప్రసిద్ధాలు లోకవ్యవహారంలో. అందువల్ల అర్థప్రతీతిలో విలంబం జరుగుతుంది కాబట్టి, అది రసభంగ హేతువు కాబట్టి దోషం. అయితే బౌద్ధంతో పరిచయమున్న పాఠకునికి అది దోషంగా కనిపించకపోవచ్చు. కాబట్టి గుణదోష నిర్ణయంలో రచయిత పాత్ర కన్న పాఠకుని ప్రమేయం ఎక్కువ. ఆయా శాస్త్రాలకు సంబంధించిన పదాలయినా కొన్ని లోకంలో వాడుకలోనికి వచ్చి ఉంటాయి. అటువంటి పదాల వినియోగంలో మనకు దోషమనిపించదు. కొన్ని పదాలు క్వాచిత్కంగా దోషమనిపిస్తాయి పాఠకుని స్థాయిని బట్టి. వివిధ స్థాయిలకు సంబంధించిన ఉదాహరణలు చూద్దాం –

ప్రాతః కాలము వాయసంబు పణినాపత్యోక్త శాస్త్రంబులోఁ
దాతఙ్స్థానులు చెప్పు డెవ్వియను చందంబొప్పఁ గౌకౌ యనన్
జాతుర్యం బలరార నుత్తరము విస్పష్టంబుగాఁ గోకిల
వ్రాతంబిచ్చెఁ దుహీ తుహీయని గృహారామ ప్రదేశంబులన్

శృంగారనైషధంలోని పద్యం – శ్రీహర్షుని శ్లోకానికి అనువాదం. దోషమేమైనా వుంటే ఆ మూలకర్తకే చెందుతుందేమో.

ఇక్కడ వ్యాకరణ శాస్త్రం విషయం. ఆ విషయాన్ని కవి కంఠోక్తిగానే ప్రకటించాడు 'పణినాపత్యోక్తశాస్త్రంబులో' అంటూ. అంటే ఇది శాస్త్ర విషయం. శాస్త్రజ్ఞులకే అర్థమవుతుందని చెప్పేశాడు. కాబట్టి ప్రత్యక్షంగా సాహిత్యంలోనికి రాలేదు కాబట్టి దోషం కాదు. పాణిని "తుహ్యోస్తాతఙాశిష్యన్యతరస్యామ్" అనే సూత్రంతో ఆశీర్లిఙ్‌లోని ప్రథమమధ్యమ + ఏక పురుషలలోని తు, హి, అనే ప్రత్యయాలకు తాతఙ్ అనే ఆదేశాలని వైకల్పికంగా విధించాడు. కాబట్టి తాతఙ్ ఆదేశం. తాతఙ్‌కు స్థానులు తు, హి. ఇవి రెండు. కాబట్టి కాకులు కౌ కౌ (ఏ రెండు, ఏ రెండు) అని అడుగుతున్నట్లున్నాయి కౌకౌ అంటూ. కోకిలలు తుహీ, తుహీ అని సమాధానం చెప్తున్నాయి. ఈ పాండిత్యం శ్రీహర్ష శ్రీనాథులది. దాన్ని కాకులు, కోకిలలకు అంటగట్టారు. ఇంత వ్యాకరణమూ తెలియకపోతే ఈ పద్యం అప్రతీత దోషంతో కూడుకున్నదే. తెలిసినవారికి చమత్కార రూపం. శాస్త్ర ప్రస్తావన పద్యంలోనే చేశారు కాబట్టి కవి తప్పుచేయనట్టే. మరో ఉదాహరణ –

హంసీయానకుఁ గామికి న్నధమ రోమాళుల్ నభః పుష్పముల్
సంసారద్రుమ మూల పల్లవ గుళుచ్ఛంబైన యచ్చోట వి
ద్వాంసుల్ రాజమహేంద్ర పట్టణమునన్ ధర్మాసనంబుండి ప్ర
ధ్వంసాభావము ప్రాగభావమనుచున్ దర్కింతు రెల్లప్పుడున్

ఇది శ్రీనాథుని చాటువుగా ప్రసిద్ధం. ఇక్కడ ప్రధ్వంసాభావము, ప్రాగభావము అనునవి తర్కశాస్త్రపదాలు. తార్కికులు అభావాన్ని (లేకపోవటాన్ని) ఒక పదార్థంగా గుర్తించి దాన్ని నాలుగు రకాలుగా విభజిస్తారు. వాటిలో ప్రాగభావం, ప్రధ్వంసాభావం రెండూ ఉంటాయి. కార్యోత్పత్తికి ముందు ఆ కార్యం లేకపోవటం ప్రాగభావం. అంటే పుట్టకముందు లేకపోవటం. ప్రధ్వంసాభావం అంటే నశించిన తరువాత లేకపోవటం. అంటే మరణానంతరం లేకపోవటం. అంటే ఒక మనిషి లేడు అంటే పుట్టలేదు కాబట్టి లేడనా? పుట్టి పోయాడు కాబట్టి లేడనా? ఏదైనా కావచ్చు. కాబట్టి రాజమహేంద్రవరంలో హంసీయానను చూసి తత్సంబద్ధ

విశేషాలను ప్రాగభావాలా? ప్రధ్వంసాభావాలా? అని తర్కిస్తూంటారట. ఇది ఆ పండితులను అవహేళన చేయటం. తర్కశాస్త్రం తెలిస్తే కాని అది అర్థం కాదు.

"గమికర్మీకృతానైకనీవృతుఁడనై"(శృంగారనైషధం), "ణిసిధాత్వర్థం బనుష్ఠింతునో"(క్రీడాభిరామం), వంటి ప్రయోగాలు కూడా వ్యాకరణశాస్త్ర పరిచయమున్న పాఠకుడికి గుణాలు. లేకుంటే దోషాలు. మరో ఉదాహరణం వసుచరిత్రనుండీ –

సిరినెత్తామర యింటికిన్ మగుడి రాఁ జెంతన్ ద్విజారావమా
ధురిఁ బుణ్యాహముఁ దెల్పుచున్ గురుతరుల్దోడ్తో నటత్పల్లవో
దరనీహారజలంబు చిల్కఁగ నయుక్తంబౌంటి మై నుండ నం
దురథాగంబు ద్విజాతి గానఁ గవయై చూపట్టె నప్పట్టునన్

ఇది ప్రాతఃకాల వర్ణన. సిరి తామరల ఇంటికి తిరిగి వస్తుంటే పక్షుల అరుపులు పుణ్యాహవాచనం చేస్తుంటే ఒంటరిగా వుండటం తప్పు కాబట్టి చక్రవాకాలు జంటగా కన్పించాయట. ప్రాతఃకాలంలో చక్రవాకాలు విరహం నుండి బయటపడి జంటగా వుండటం. దాన్ని కవి ఉత్ప్రేక్షిస్తున్నారు. ద్విజాతి కాబట్టి జతగా కన్పించిదని.

పైనంతా శుభసందర్భ వర్ణన. శుభకార్యానికి బయలుదేరినప్పుడు ఒంటి బ్రాహ్మణుడు ఎదురురాకూడదని శకునశాస్త్రం. అది తెలిస్తే గానీ ఈ పద్యంలోని చమత్కారం అర్థం కాదు. ద్విజాతి అంటే బ్రాహ్మణుడు, పక్షి అని రెండు అర్థాలు. కాబట్టి ద్విజాతి ఒంటరిగా ఎదురు రాకూడదని చక్రవాకాలు జతగా వచ్చాయి. ఇది కవి ఉత్ప్రేక్ష. శకునశాస్త్రం తెలిస్తే అందం. లేకుంటే దోషం.

ఎదగడానికి కెందుకురా తొందర
ఎదర బ్రతుకంతా చిందరవందర...
... పిలుపు రాకుంటే నీ ఆట బేస్తురా
మళ్ళా పెట్టాలి ఇంకో దరఖాస్తురా
ఎండమావి నీకెపుడూ దోస్తురా

ఇక్కడ బేస్తు పదం. ఇది పేకాటలో ప్రసిద్ధం. గోదావరిలోని అడ్డాటలో, సర్కారు జిల్లాల్లోని 304లో వినబడే పారిభాషిక పదం. కన్యాశుల్కంలో మధురవాణి ఇంట్లో భుక్త, పోలిశెట్టి, సిద్ధాంతి, మధురవాణి పేకాడేటప్పుడు బేస్తుపదం విరివిగా కనిపిస్తుంది. "మూడోయెత్తాడపు బేస్తు; గాపకముందా? బేస్తుమీద కుదేలెట్టి, బాకీలెట్టి, యగేయడానికా?" అని పోలిశెట్టి మాట. గోదావరి జిల్లాలలో అడ్డాటలో ఆట, అడ్డు, షరతు ఇలా పందెం మీద పందెం సాగుతుంది ఒకే ఆటలో (ఒక పంపకంలో). 304 ఆటలో ఆట చెప్పటం గెలిస్తే గెలుపు. ఓడితే బేస్తు. తరువాతి పంపకలో బేస్తుతో పందెం సాగుతుంది.... చివరది కుదేలు. ఈ విశేషాలు తెలియకపోతే ఆ పాటగాని, కన్యాశుల్కంలోని మాటలుగాని అర్థం గావు.

ఆటకట్టు, తెరచి రాజు, త్రోసిరాజు, వంటి పదాలు చదరంగంలోనివి. వాటిని వ్యవహారంలోనూ వాడుతాం. తెరచి రాజు విశ్వనాథవారి నవల పేరు. అది అర్థం కాలేనివాడికి అవి దోషాలు. అర్థమైతే విశిష్టార్థస్ఫోరకాలు.

నా 'బృందావనగానం' లో నుండి ఒక పద్యం.

అట ఈ పీ ఎస్ స్వల్పమె
యట, పీయీ రేషియో మహాధికమట, యీ
కటుతర మార్కెటు గతి
యటు నిటు బృందములయందునయినం దోఁచున్

ఈ పద్యం స్టాక్ మార్కెట్టుకు సంబంధించిన పరిభాషలతో కూడినది. "పణినాపత్యోక్త శాస్త్రంబులో" అన్నట్టు మార్కెటు గతి సూచన చేయబడింది. ఈ పీ యస్ అంటే Earning per Share. పియీ రేషియో అంటే Market Price Verses Earning Per Share. అంటే ఒకొక్క వాటాపై సాధించిన లాభం EPS. ఒకొక్క షేరు ధర ఆ EPSకు ఎన్ని రెట్లు ఉంటుందో చెప్పేది PE Ratio. లాభం చాలా తక్కువ. షేరు ధర చాలా ఎక్కువ అని అర్థం. ఆ పరిస్థితి చాలా ప్రమాదకరం. పెట్టుబడిదారులు ఆ విషయాన్ని. దానికి కారణాలనూ క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత కానీ ఆ షేరు కొనుగోలు చేయకూడదు. బృందాలలో కూడా అలాగే పస తక్కువ, ప్రచారం ఎక్కువ కాగూడదని వ్యంగ్యం. ఇది స్టాక్‌మార్కెటు గురించి తెలిస్తే అందం లేకుంటే దోషం.

వైదికుల పరిభాషలో "వయందేవస్య ఎక్కడ?" అని అడుగుతుంటారు. భోజనమని దానికర్థం. కన్మాశుల్కంలో పూజారి "వైసబుపె అని యెందుకన్నాడు బాబూ" అని రామప్పంతులుతో అంటాడు ఒక సన్నివేశంలో. ఇది కూడా ఒక పరిభాష. 'వైదికుడికి సదా బుద్ధి పెడసరం' అని ఆ పరిభాష కర్థమట. ఇలా ఆయాదేశకాలలో చాటుగా మాటుగా అపరివారితకంగా మాటాడుకోటానికి కొన్ని సాంకేతిక పద బంధాలను ఏర్పాటు చేసుకుంటారు. అటువంటివి సాహిత్యం లోనికి ఎక్కటంతో చాలా ఇబ్బంది. అందుకే దోషమని వామనుని అభిప్రాయం.

ఇక్కడ ఒక విషయం చర్చించాలి. వామనుడే "లోకః విద్యా ప్రకీర్ణం చ కావ్యాంగాని" అని కావ్య నిర్మాణానికి అన్ని విద్యల పట్ల ప్రాథమిక జ్ఞానం అవసరమని ఆ కావ్యాలంకార సూత్రవృత్తిలోనే వివరించి వున్నాడు. అటువంటప్పుడు

# పద్యపరిమళం

సీ॥ తరుణార్క కబళనోద్ధతి పూనె నెవ్వాడు
రుచులచే ఫలమోహ రుచుల చేత
అకలంక రామ ముద్రిక పూనె నెవ్వాడు
శయముచే హృత్కుశే శయముచేత
మున్నీరు పల్వలంబుగ దాటె నెవ్వాడు
జవముచే గుణ గణార్జవముచేత
అక్ష శిక్షా ప్రౌఢి నలరారె నెవ్వాడు
రణముచే నియమ ధారణముచేత
తే.గీ॥ ధరణి నెవ్వాడు దానవద్విరద దళన
విహృతి తన కేసరి కిశోరవృత్తి నెఱపె
అతని మత్కావ్య భవ్య వాగమృత ఘటన
మంజులస్వాంతు హనుమంతుమది దలంతు

– వసుచరిత్ర, భట్టుమూర్తి

శత పద్య లేఖినీ సంధాన ధౌరేయుడు, సంగీత కళా రహస్య నిధి, శ్లేష యమక చక్రవర్తి భట్టుమూర్తి. 'శ్రీరామ పదారవింద భజనానందు'డైన ఈ కవి హనుమద్భక్తుడు కూడ. 'రామాయణ మహా మాలా రత్న'మైన హనుమ సాధించిన అద్భుత ఘన కార్యాలనూ హనుమ విశిష్ట వ్యక్తిత్వాన్నీ కీర్తిస్తూ, శ్లేష యమకాలు ఆధారంగా వసుచరిత్రలో మూర్తికవి రచించిన అందమైన ప్రౌఢ రచన ఈ పద్యం.

హనుమ ఎలా ఉన్నాడు? 'స్వర్ణశైలాభ దేహుడు' కదా! తన దేహకాంతితో ఉదయభాస్కర బింబకాంతులను మింగి వేస్తున్నాడు. లేత సూర్యుని కాంతిని మించిన తేజఃపుంజం హనుమ. తాను పుట్టీ పుట్టగానే, ఆకాశంలో అప్పుడే ఉదయించిన భానుబింబాన్ని చూసి, రుచికరమైన ఎఱ్ఱని పండు అనుకొని, మ్రింగబోయాడు హనుమ. **"తరుణార్క కబళనోద్ధతి పూనె నెవ్వాడు – రుచులచే ఫలమోహ రుచుల చేత".**

సీతాన్వేషణకోసం సుగ్రీవాజ్ఞ చొప్పున నలు దిక్కులకూ వానర వీరు లందరూ బయలుదేరుతున్న సమయంలో– శ్రీరాముడు హనుమను పిలిచి, అంగులీయకం ఇచ్చాడు – సీత కనిపిస్తే ఆనవాలుగా అందించటానికి. రామనామాంకిత మైన ఆ ఉంగరాన్ని(రామ ముద్రికను) దోసిలి పట్టి వినయ వినమిత గాత్రుడై అందుకున్నాడు హనుమ. పరమ పవిత్రమైన తన హృదయ పద్మంలో శ్రీరామ ముద్రికను ధరించాడు హనుమ. రామ నామం, రామ రూపం, రామ తత్త్వం నిలువెల్లా నింపుకున్న భాగవత శ్రేష్ఠుడు హనుమ. **"అకలంక రామ ముద్రిక పూనె నెవ్వాడు – శయముచే హృత్కుశేశయము చేత".**

లంకా నగరం చేరటానికి దక్షిణ సముద్రాన్ని అలవోకగా దాటాడు హనుమ. అతడి వడికీ వేగానికీ ఆ సముద్రం పిల్లకాలువ అనిపించింది. రాగ ద్వేషాలకూ అరిషడ్వర్గాలకూ లోబడకుండా సద్గుణ సంపదతో, ఋజు వర్తన వైభవంతో భవసాగరాన్ని అవలీలగా దాటిన మహనీయుడు హనుమ. **"మున్నీరు పల్వలంబుగ దాటె నెవ్వాడు – జవముచే గుణ గణార్జవము చేత".**

లంకా నగరంలో రాక్షస సంహార కాండ సాగించాడు హనుమ. రావణ పుత్రుడైన అక్ష కుమారుణ్ణి సంహరించాడు ఆ యుద్ధంలో. నియమ నిష్ఠాగరిష్ఠుడై, ఇంద్రియ నిగ్రహ విశేషాన్ని సాధించాడు హనుమ. **"అక్ష శిక్షా ప్రౌఢి నలరారె నెవ్వాడు – రణముచే నియమ ధారణముచేత".**

రాక్షసులను సంహరించే కేసరిపుత్రుడు హనుమ. మదపు టేనుగులను చీల్చి చెండాడే సింహ కిశోరుడు హనుమ. **"ధరణి నెవ్వాడు దానవ ద్విరద దళన విహృతి తన కేసరి కిశోరవృత్తి నెరపె".**

అలాంటి హనుమ తన భవ్య కావ్యానికి తగిన వాగమృతాన్ని ఘటింపచేయగల మంజులస్వాంతుడు. గొప్ప మనస్సు గలవాడు. ఆ హనుమత్ స్మరణతో కావ్య రచనకు పూనుకున్నాడు హనుమ. 'హనూమత్ స్మరణ' ఎన్నో సత్ఫలాలను ప్రసాదిస్తుంది. వాటిలో 'వాక్పటుత్వం' ఒకటి. **"అతని మత్కావ్య భవ్య వాగమృత ఘటన మంజుల స్వాంతు హనుమంతు మది దలంతు".**

- ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి

శాస్త్రప్రయుక్తమైన పదాలను స్వీకరించటం దోషమెలా అవుతుంది? అందుకే శాస్త్రమాత్ర ప్రయుక్తమన్నాడు. అది ఆయా శాస్త్రాలలోని పదమైనా లోకంలోనికి కూడా వచ్చివుంటే అది తప్పు కాదు. అంటే అవగాహనకు అడ్డుపడదు. అర్థావగాహనకు ప్రతిబంధకమయ్యే శాస్త్రపదాలను వాడకూడదన్నదే తాత్పర్యం. అది లోకప్రచురమైనా అర్థావగాహనను ఆపలేకపోయినా దోషం కాదు. అంటే ఒక అన్యశాస్త్రీయ పదాన్ని ఓం ప్రథమంగా వాడటంలో జాగరూకత కావాలన్నదే వామనుని అభిప్రాయం. మొదటిసారిగా సాహిత్యంలోనికి వచ్చినా రసస్ఫూర్తికి విఘాతం కలిగించకపోతే నిర్దుష్టమే. కాబట్టి 'అప్రయుక్త' దోష విషయంలో కవి, పాఠకుడు కూడా జాగరూకులై వుండాలి.

(సశేషం)

# బమ్మెరపోతన భాగవతం–అలంకార సౌందర్యం

- వైద్యం వేంకటేశ్వరాచార్యులు

## శ్లేషాలంకారం

కేవలం ప్రకృతాలకుకానీ,కేవలం అప్రకృతాలకుకానీ శబ్దమాత్ర సామ్యం ఉంటే శ్లేష. పోతన భాగవతంలో శ్లేష అద్భుతమైన రూపాలలో దర్శన మిస్తోంది. సంస్కృతంలోని కాదంబరీ గద్యలోని శ్లేషను పోలిన గద్యను బమ్మెరవారు నైమిశారణ్య వర్ణనసందర్భాన హృద్యంగా రచించినారు.

### నైమిశారణ్యవర్ణనము

**వ. మధువైరి మందిరంబునుం బోలె మాధవీమన్మథ మహితంబై.**

**అర్థం:**

1. మధువనే రాక్షసుడిని చంపిన విష్ణువు యొక్క మందిరంలా మాధవి(లక్ష్మితో)మన్మథునితో ఉంది నైమిశం.

2. మాధవి అంటే గురివిందచెట్టు,మన్మథ అంటే వెలగ చెట్టు – ఈ చెట్లు కలిగి ఉంది నైమిశం.

**వ. బ్రహ్మగేహంబునుంబోలె శారదాన్వితంబై**

**అర్థం:**

1. బ్రహ్మదేవుని సత్యలోకంలా సరస్వతిదేవితో కూడు కున్నదై.

2. శారదాన్వితంబై, శారదా = ఏడాకుల అరటిచెట్టు, పచ్చపెసర.

**వ. నీలగళసభా నికేతనంబునుంబోలె వహ్ని వరుణ సమీరణ చంద్ర రుద్ర హైమవతీ కుబేర వృషభ గాలవ శాండిల్య పాశుపత జటిపటల మండితంబై**

**అర్థం:**

1. నల్లని కంఠంగల మహేశ్వరుని సభామండపంవలె

వహ్ని = అగ్ని, వరుణ = వరుణుడు, సమీర = వాయువు, చంద్ర = చంద్రుడు, రుద్ర = ఏకాదశరుద్రులు, హైమవతీ = పార్వతి, కుబేర = కుబేరుడు, వృషభ = నంది, గాలవ = గాలవుడు, శాండిల్య = శాండిల్యుడు, పాశుపత = పాశుపతదీక్షపొందినవారు, జడ = జడలు పెంచినవారి, పటల = గుంపులతో, మండితంబై =ప్రకాశించినదై.

2. వహ్ని = చిత్రమూలం, వరుణ = ఉలిమిరిచెట్టు, సమీరణ = మరువం, చంద్ర = పెద్ద ఏలకి, రుద్ర = రుద్రాక్ష, హైమవతి = తెల్లవస (కరకచెట్టు), కుబేర = నందివృక్ష, వృషభ = అడ్డసర, గాలవ = లొద్దుగచెట్టు, శాండిల్య = మారేడుచెట్టు, పాశుపత = శ్రీవల్లి, జటి = జడలతీగెల, పటల = సమూహంతో, మండితంబు = ప్రకాశిస్తోంది.

**వ. బలభేది భవనంబునుంబోలె నైరావతామృత రంభాగణికాభి రామంబై**

**అర్థం:**

బలభేదివనంబునుంబోలె – దేవేంద్రుని సౌధంవలె

1. ఐరావత = ఐరావతమనే ఏనుగుతో, అమృత = సుధతో, రంభా = రంభ మొదలయిన, గణిక = (దేవ)వేశ్యలతో, అభిరామంబై = మనోహరమై.

2. ఐరావత = నారింజ, అమృత = ఉసిరిక, రంభ = అరటి, గణిక = అడవిమొల్ల, మొదలైనవాటితో మనోహరమై.

**వ. మురాసుర నిలయంబునుంబోలె నున్నత్త రాక్షసవంశసంకులంబై**

**అర్థం:**

1. మురాసురు డనే రాక్షసుని నివాసంవలె –

ఉన్మత్త = బాగామదించిన, రాక్షస = రక్కసుల, వంశ = కులంతో, సంకులంబై = కూడినదై.

2. ఉన్మత్త = ఉమ్మెత్త, రాక్షస = నల్లకచోర, వంశ = వెదురు మొదలైనవాటితో కూడినదై.

**వ. ధనదాగారంబునుంబోలె శంఖపద్మకుందముకుంద సుందరంబై**

**అర్థం:**

1. ధనదాగారంబునుంబోలె = కుబేరుని నిలయంలా–

శంఖ, పద్మ, కుంద, ముకుంద మొదలయిన నవనిధులతో మనోహరమై,

2. శంఖ = బోరపుష్పి, పద్మ = తామర, కుంద = మొల్ల, ముకుంద = కుందురుష్కమనే గంధపుచెట్లతో సుందరంగా ఉన్నదై.

**వ. రఘురామ యుద్ధంబునుంబోలె నిరంతర శరానల శిఖా బహుళంబై**

**అర్థం:**

1. రామచంద్రుని యుద్ధంలా–

శర = బాణాలయొక్క, అనలశిఖా = అగ్నిజ్వాలలతో, బహుళంబై

2. శర = రెల్లు, అనలశిఖా = శక్రపుష్పి అనేవాటితో నిండినదై.

**వ. పరశురామ భండనంబునుంబోలె నర్జునోద్భేదంబై**

**అర్థం:**

భార్గవరాముని యుద్ధభూమిలా–

1. అర్జునోద్భేదనంబై = కార్తవీర్యార్జునుని చీల్చినదై,

2. కార్తవీర్యార్జునోద్భేదనంబై = భూమిని చీల్చుకుంటూవచ్చే పొదలు కలదై.

(సశేషం)

## ఈనెల అంశం: మహిత మార్గశీర్షం

### విద్వాన్ భైరపనేని పోతురాజు చౌదరి

ఆ.వె. లలిత సుగుణ రాశి రమణీయ సొగసరి
చిగురుబోడి యొకతె చెంత జేర
కుముద గంధ జాలు కురిసెనెద మురియ
వాలెనింద్ర ధనువు వసుధ యందు

ఆ.వె. నేలనగెను జూచి, నింగిమురిసెతాను
బంతిబాల సౌరు పరువాలనెనరుల
ముద్దు మోమునందు నద్దకముగ
ముంగురులుకదలుచు సంగడించ

తే.గీ. ఆరుమల్లెలెత్తునబెర్గి యాటలాడి
నూత్న యౌవన పోషాకు నునుపుదేరి
సరస రసఖనియౌతాను జలరుహాక్షి
పోడుములలీల కందోయి పోహళీల

తే.గీ. అధరకలశమందునొలుకుమధుర రసము
నీలికురులందు మణిశోభ నెగడు గుణము
మరునిచెలియను మించెడి  మరువకమన
తెరువ మేనున దొణకుచు దెలియ వచ్చె

తే.గీ. పైరగాలుల తలయూచు పైడిబొమ్మ
వెండి వెన్నెలనాటాడు విరుల తూడు
హిమతుషారాల స్నానంపు హేమరూప
మోహనపువీణ మురిపాల ముద్దబంతి

### వి.వి.సత్యప్రసాద్

మ. జడలో చేరగ నోచలేదు,మరి పూజల్ సేయ పుష్పంబులన్
నడిమిన్ జేరదు ముద్దబంతి, మగువల్ న్యక్కారమున్ జూపుచున్
విడుచున్ మాలలు కట్టువేళ, నయినన్ విందౌను నేత్రాలకున్,,
గడు సంతోషమె నింపు, తోరణముగా గట్టంగ శోభిల్లెడిన్!!

తే.గీ. ఇంట శుభకార్యములకు, పేరంటములకు,
పండుగల నాడు మగువలు బంతి పూల
తోరణమ్ములుఁ గట్టిన తుష్టిఁ గూర్చు!!
మందిరమ్ముల వ్రేలాడు మాల లన్ని
మురిపెముల ముద్ద బంతులె!! ముదముఁగూర్చు!!

తే.గీ. పరిణయంబైన నూతన వధువు, వరుడు,
బంతి పూవుల చెండుతో బంతి యాట
నొకరి కొక్కరు విసరగ, మొకము లందు
సిగ్గు దొంతర లప్పుడె మొగ్గ చూపు!!

# ఖండ-శర్కర

**నిర్వహణ: శతావధాని ఎం.వి. పట్వర్ధన్**
**అష్టావధాని చేపూరి శ్రీరామ్**

తే.గీ. బంధువులు లేచి నొక్కొక్క బంతి పువ్వు
క్రొత్త జంటపైనిరువ్వగ కూర్మి మీర,
మారు మ్రోగును చప్పట్లు!!మరువ లేని
జ్ఞాపకమ్ములె గుండెలో సంతరించు!!

చం. పురుషుల మేలి చూపులు సమున్నత సుందరి పైన వ్రాలినన్
సరగున మోహ పాశమున చక్కగ చిక్కగ, "ముద్ద బంతి"గా
తరుణినిఁ పోల్చి,మాటికిని తల్చుచు, ప్రేమను పెంపుఁజేయగన్
'వరుడ'యి,పెండ్లి చేసుకుని, వర్ధిలుచుండును "ముద్దబంతి"తో!

### పెనుగొండ రామబ్రహ్మం

ఉ. తోటకు నందమిచ్చుఁ గద తోరపు రీతిని విచ్చినంతనే
బోటికిఁ గొప్పు కందమటు భూరిగఁ గాంచి ప్రకాశమానమౌ
పాటల భావసంపదలఁ బాటవ మొప్పఁగ వృద్ధిఁ జేయుచున్
నీటుగు ముద్దబంతులిల నిత్యమటుల్ మురిపించు సర్వదా

చ. వరలఁగ రంగురంగులటు భాసిలి ముగ్ధమనోహరాకృతిన్
బరఁగఁగ నందచందముల భవ్యత నూతన శోభలొందుచున్
విరియఁగ భావ సంచయము విచ్చిన పూవుల రూపు రేఖలన్
ధర మురిపించు సోయగపు స్థావర మొప్పుడు ముద్దబంతిదే!

రతోద్ధత పద్దుఁ గాంచి విరిబంతులందమే
ముద్దులొల్క నటు పుష్ప పంక్తులన్
హద్దులేని నిజ హ్లాద సందిటన్
ముద్దబంతులకు మోదమందరే

వసంత తిలక పొందైన వర్ణములఁ బూసి యెలర్చినంతన్
సౌందర్య సంస్థిత సుచారు వికాశ రూపున్
విందుల్ గనున్ దనరు ప్రీతిని ముద్దబంతుల్
బొందంగ డెందమటు పోఁడిమి సంభ్రమమ్మున్

మ. వరమై నిండుగ ముద్దబంతులిల నుద్భాసిల్ల పూఁదోఁటలో
నెరవై రంగుల యింద్రచాప మొసఁగున్ నిర్మించి దీపించుచున్
స్థిరమై సంతస ముద్భవించి వరలున్ దేదీప్యమానంబుగన్
మురిపించున్ మనుజాళి నెప్పుడటులన్ ముద్దారు రూపంబులన్

### శిష్లా వి ఎల్ ఎన్ శర్మ, హైదరాబాద్

చ. విరివనమందు హాసమున విస్తృతమై యలరారి పాదులన్
మురియుచు లేతపచ్చమిసి ముగ్ధమనోహర కెంపుకాంతులన్
దరిగొని నేత్రపర్వమయి నితావుల బూయుచు రామణీయతన్
విరివిని బంచి వైభవము నిప్రీతి నొనర్తువు శీతకాలమున్!

ఉ. ద్వారము లందు తీరుగ విభాసితమై యలరారి గీములన్
దోరణమై వెలుంగు నట దూగుచు దండల పెండ్లిపందిరిన్
జేరిచి గొబ్బి శీర్షము సృజించు వినూత్నపు రంగవల్లిపై
బేరిచి కూర్చి యాడెదరు పేర్మి రహించగ సంకురాతిరిన్!

ఉ. నవ్వుకు నిన్ను బోల్చెదరు నర్తన లొప్పెడి నిండు కాంతులన్
బ్రవ్వుచు రంగులన్ గదిరి రాగ విరాజిత పుష్పరాగమై
దివ్వెగ వెల్గులన్ దురిమి దివ్యమహద్యుతి గోచరింపగా
నివ్వనమందు వర్తిలుచు హేలగ నాడెదొ! ముద్దబంతివై!

ఉ. ఏలనొ నామనంబు సహియింపదు నీకిడు గౌరవమ్మునన్
బోలగ నెన్నరే యితర పూవుల మాదిరి మాలల్లుచున్
నీ లలితాత్మవైభవ వినిర్మలతన్ గనరేల వాటికిన్
జాలగ నెంచి దేవునికి చక్కగ నీయరు కొందరేలకో!

చ. మురిపెములీనె డీపసిడి నిపూల పసందున చిందురాగముల్
పరిపరి నెమ్మనంబున వినిపంచిక వోలె శ్రుతించుమీటులన్
దరినిడి దోసిటన్నిలిపి నిదారుల నిత్యమహోత్సవ ప్రభా
భరితము జేయుడీ యవనిని ప్రాంగణ మంతయు ముద్దబంతులన్!

### ఆరవల్లి శ్రీదేవి

తే.గీ సందె వేళ పొలము గట్ల చనువు జూపి
కన్నులల్లన నల్లార్చి కలికి నిలిచి
సన్న జాజి పందిరిచెంత కన్నుగీటె
ముద్దు మురిపాల పూబంతి ముద్దబంతి!!

తే.గీ. మంద మలయానిలయముగా సందడించె
లలిత లావణ్య సౌరభ చలిత చతుర
మెల్లమెల్లగా మీటెతా మేని గతుల
ముద్దు మురిపాల పూబంతి ముద్దబంతి!!

తే.గీ. ఉదయ కాంతుల వెదజల్లి హృదయమందు
తరళ వీక్షణల్ ప్రసరించెతపన పెంచి
విరహ వేదన తా బెంచె విమల గతుల
ముద్దుమురిపాల పూబంతి ముద్ద బంతి!!

తే.గీ. అరవిరిసిన మందారమై యందగించి
విరిసి విరియని క్రొవ్విరి విరియు పగిది
తరుణ విరిబాల యందాల గరిమ పెంచె
ముద్దు మురిపాల పూబంతి ముద్దబంతి!!

తే.గీ. ప్రణయ నీరజ సౌరభ ప్రాభవమ్ము
లెదను శోధించి తాకగా నేలె హేల
ప్రాణములతోడె పరువాల పల్లవించి
ముద్దుమురిపాల పూబంతి ముద్దబంతి!!

### మంకుశ్రీను, కొప్పర్రు

తే.గీ. ముదిత కొప్పున మురిపాల ముద్దబంతి
ముచ్చటన్ గొల్పు చుండును మోహనముగ
దాని మేలి క్రొందావులు తన్మయత్వ
మిడు రసజ్ఞ శేఖరులకునేమి చెపుదు

ఆ.వె. పచ్చనైన రెమ్మ పైని విలాసంబు
లారబోయుచుండు నబ్బురముగ
పసుపువన్నెతో శుభంబుగ కనువిందు
చేయుముద్దబంతి చెప్పనేల

చ. అరయగ బంతి మార్గశిరమందుననికానగ వచ్చునెల్లెడన్
మరుని శిలీముఖంబులకు మారుగనినిల్చునవారితంబున్
సురవరులైన మెచ్చవలెనిసూనవరిష్ఠమిదే సుమాళిలో
మరిమరి బంతి అందములునిమానసమంటును మాటిమాటికిన్

కం. పండిత సత్కారంబున
ఖండిత లీన్ గ్రహించు కవి గారికి ఈ
మండనమొకటే చాలున్
కొండొక పూదండ యేల కొమరొప్పంగన్

తే.గీ. దివ్యులకుముద్దబంతియే తృప్తినిడును
పూజలందగలట్టి సంపూజ్యమైన
చరిత ముద్దబంతికి దక్కె, చక్కదనము
నందు రారాణి యిద్ది పసందు కాదెనిని

**తదుపరి అంశం**

**శివ! శివా!**

పై అంశానికి 5 పద్యములను 9441039146
ఫోన్ నంబరుకు వాట్సప్ ద్వారా పంపగలరు
ఖండికలు పంపవలసిన ఆఖరు తేది
15 ఫిబ్రవరి 2026

# సంస్కృతం సంస్కృతి 5

నారుమంచి వేంకట అనంతకృష్ణ శర్మ

సంస్కృతభాషా పరిజ్ఞానము యొక్క ఆవశ్యకత నిర్ద్వంద్వముగా తెలిసినది. ఎలా నేర్చుకోవాలి, ఎంతకాలం పడుతుంది అన్నది తెలుసుకోవాలి కదా. అది తెలుసుకునే ముందు సంస్కృతాధ్యయనము పైన మన అపోహలు, నేర్చుకునే విధానాల పైన కొన్ని ముఖ్యమైన విషయాలు చెప్పుకోవాలి. అందుకోసం భాషాధ్యయన విధానముల మౌలికాంశాలు ముందుగా ప్రస్తావిస్తాను.

సంస్కృతము నేర్చుకోవడం అంత సులభం కాదు అది అందరికీ వచ్చే భాష కాదు అన్న అపవాదు గురించి ఇప్పుడు చూద్దాం. సంస్కృతముతో సహా ప్రపంచములో ఉన్న భాషలన్నిటి లోనూ అతి కఠినమైన భాష ఏది అన్న ప్రశ్నకి రకరకాల జవాబులు వస్తవి. ఉదాహరణకి చైనీస్ భాషనో రష్యన్ భాషనో చెప్పుకుందాం. క్షణం ఆలోచిస్తే ఆ భాషలోని చిన్నపిల్లవాడు కూడా నిర్భయముగా, నిర్దుష్టముగా మాట్లాడుతున్నాడన్నది స్పష్టం కదా. పిల్లవాడు కూడా మాట్లాడిన భాష కష్టమైనది ఎలా అవుతుంది?

మనకి తెలియదనుకునే ఒక భాషలో, ఉదాహరణకి సంస్కృతమనే అనుకుందాం, ఎవరైనా మాట్లాడుతున్నప్పుడు వింటే మనకి అర్థమౌతున్నదంటే ఆ భాష మనకి వచ్చునని అర్థం. మాట్లాడలేకపోవచ్చు కానీ అర్థం అవుతున్నది. మరింత నిశితంగా పరిశీలిస్తే అర్థమైన ప్రతి పదము, వాక్యనిర్మాణము మనకు తెలుసు కనుకనే అర్థమౌతున్నది, కానీ తిరిగి అనడానికి ఏదో అడ్డు పడుతుంది. అది 'తప్పౌతుందేమో' అన్న భయం. కనుక మనం భాష నేర్చుకోవడం కన్నా భయం దూరం చేసుకోవడం చాలా చాలా ముఖ్యమైన విషయం.

ఇప్పుడు ఇక్కడనుంచి చాలా జాగ్రత్తగా గమనించండి. సంస్కృతం నేర్చుకోవడానికి ముందు వ్యాకరణం నేర్చుకునే ప్రయత్నంచేస్తాం. తరువాత అధ్యాపన గ్రంథములు చదువుతాము. తరువాత మనం నేర్చిన వ్యాకరణాన్ని అనుసంధానంచేస్తూ ఆలోచిస్తూ ఆలోచిస్తూ తప్పౌతుందేమో అన్న భయంతో మాట్లాడే ప్రయత్నం చేస్తాము. ఇప్పుడు ఒక చిన్న పిల్లవాడు భాషను ఎలా నేర్చుకుంటాడో గమనిద్దాం. పుట్టిన ఏడాదికి సుమారుగా అత్తాతాతా అంటాడు. తరువాత చిన్న పదాలు, చిన్న వాక్యాలు తరువాత అనర్గళముగా మాట్లాడటం జరుగుతుంది. ఇక్కడ పట్టుకోవలసిన ముఖ్యమైన అంశం పుట్టిన దగ్గరనుండీ తను మాట్లాడకున్నా, తన చుట్టూ సమాజంచేసే 'శబ్దాలు' నిశితంగా వినడం, విని విని అవగాహన చేసుకొని 'శబ్దము'ను 'అర్థవంతమైన పదము'గా అర్థంచేసుకోవడం, తప్పులు ప్రయోగించడం, చుట్టూ ఉన్నవారు సరిచేయడం, అలా క్రమముగా సాధుప్రయోగము చేయడం. అంటే మొదటి మాట మాట్లాడటానికి ముందు చాలా కాలం 'విన్నాడు'. వ్యాకరణము అంటే పద,వాక్య సాధుత్వము సహజముగా విన్నవిధముగా అనుటలో అంటే ప్రయోగదశలో నేర్చుకున్నాడు అన్నమాట. అంటే క్రమము గమనిస్తే "వినుట – అర్థం చేసుకొనుట – అనుట – చదువుట – వ్రాయుట" అని తెలుస్తుంది. ఇప్పుడు సంస్కృతముగానీ మరే ఇతరభాష కానీ నేర్చుకునే విధానము చూస్తే " అక్షరమాల దిద్దుట – చదువుట – అనుట". 'వినుట' అన్నది దాదాపు లేనట్లే చెప్పుకోవచ్చు. అంటే శ్రవణ సంస్కారము లేదు కనుక భాషపై సాధికారత రాదు. మాతృభాషాధ్యయనానికి, ఇతర భాషాధ్యయనానికి ఇది అతి పెద్ద మరియు ముఖ్యమైన భేదము. తాత్పర్యమేమిటంటే సంస్కృతం బాగా వినాలి. వినగా వినగా శబ్దము అర్థమై పదముగా మారి, వాక్యములో ఎలా యిముడుతున్నదో అవగాహనకి వచ్చి, మనకి తెలియకుండానే వినే ప్రతీదీ తరువాత పదం ఊహకి వస్తుంది, అలా భాష, విభక్తి జ్ఞానము, వ్యాకరణాంశములు ( సూత్రములు తెలియకున్నా, ప్రయోగము తెలిసి) బోధ కలుగుతుంది. ఇలా నేర్చుకున్నప్పుడు వద్దన్నా సంస్కృతమే కాదు ప్రపంచభాషలు ఏవైనా వస్తాయి.

ఇక్కడ మరొక్క ముఖ్యవిషయం ప్రస్తావించి ఈ వ్యాసం ముగిస్తాను. చిన్నపిల్లవాడికి, మనకి ఒక తేడా ఉన్నది. చిన్నపిల్లవాడికి తప్పులు పోతాయి అన్న భయం లేదు. విన్నవాళ్ళు అది తప్పు అని చెప్పేవరకు తప్పు అన్న మాట అనడు. పెద్దవాళ్ళకి తప్పులు పోతాయేమో అన్న భయం, ఏమన్నా అనుకుంటారేమో అన్న భయం ఉంటాయి. కొత్త భాష నేర్చేటప్పుడు మన వయసు పురిటిపిల్లాడి స్థితి అనుకుని ప్రారంభిద్దాం. వద్దన్నా వస్తుంది ఏ భాష అయినా. సంస్కృతం అన్నిటికన్నా తేలికగా వస్తుంది. తదుపరి వ్యాసములో భాషాధ్యయనములోని మెళకువలు, మనం నేర్చుకునేందుకు సూచనలు యథామతి చెప్పుకుందాం.



ఉప్పలధడియం భరత్‌శర్మ గారి శతావధానం ప్రారంభ సభలో పాల్గొన్న
'మహామహోపాధ్యాయ' డా॥ శలాక రఘునాథశర్మ,
పూర్వ ప్రభుత్వ సలహాదారు డా॥ కె.వి.రమణాచార్య ఐఏఎస్



07.12.2025 తేదీన గంగు వేంకట రాజయ్య, శ్రీమతి సుశీల గారల శతజయంత్యుత్సవ సందర్భంగా
ద్విశతావధాని, అవధానరాజహంసిని డా॥ బులుసు అపర్ణ గారి అష్టావధానం
సంచాలకులు: అవధాన విద్యావికాస పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షులు మరుమాముల దత్తాత్రేయ శర్మ
నిర్వాహకులు: గంగు నరసింహమూర్తి, గంగు సచ్చిదానందమూర్తి, ఎల్లికంటి జ్ఞానప్రసూన

అవధాన విద్యా విజయతే తరామ్

**Avadhana Puskarini**
20 January 2026



దర్శనమ్ ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక 21వ వార్షికోత్సవ గురుసత్కార సభలో
అవధాన పుష్కరిణి 4వ సంచికను ఆవిష్కరిస్తున్న మహాసహస్రావధానులు
**డా॥ మాడుగుల నాగఫణిశర్మ, డా॥ గరికిపాటి నరసింహారావు** గారలతో
ప్రముఖ కవిపండితులు

**Published by**
Avadhana Vidya Vikasa Parishat
Sri Rama Sadanam, 29-1499/6/1, Road No.1
West Kakatiya Nagar, Neredmet, Secunderabad - 500056
Ph: 9441039146